

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM

RNI NO: TGTEL/25/A0471


తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...



## రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.



Contact Number 9059328777



రంగారెడ్డి బుధవారం 16-09-2026 సంపుటి: 02 సంచిక : 136 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Wednesday 16-09-2026 Volume :02 Issue: 136 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani


# రేవంత్ ప్రతి స్కీం వెనుక స్కామ్

## ధరణి భూములకు రక్షణ కవచంలా ఉండేది

- యజమానికి తెలియకుండానే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి
- అసైన్డ్ భూముల హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలి
- బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే కాంగ్రెస్ అక్రమాలు వెలుగులోకి: కేటీఆర్





**భూభారతి కాదు.. భూహారతిగా మారింది**

న్యూఢిల్లీ,
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చే ప్రతి పథకం వెనుక ఒక కుంభకోణం ఉంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. గతంలో ధరణి పోర్టల్ భూములకు ఇనుప కంచెలా, రక్షణ కవచంలా పనిచేసేదని, ప్రస్తుతం భూ యజమానులకు తెలియకుండానే రిజిస్ట్రేషన్లు జరిగే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. భూ యజమాని వేలిముద్ర లేకుండా భూ లావాదేవీలు జరిగే అవకాశం గతంలో ఉండేది కాదని కేటీఆర్ అన్నారు. ప్రస్తుతం యజమానులకు సమాచారం లేకుండానే ఆస్తులు నిషేధిత జాబితాలో చేరుతున్నాయని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన 'భూభారతి' పేరే తప్ప, వాస్తవానికి అది 'భూహారతి'గా మారిందని ఆయన విమర్శించారు. అడ్డగోలు విధానాలను వెంటనే నిలిపివేసి ధరణి పోర్టల్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఎస్సీ, ఎస్టీల అసైన్డ్ భూములను క్రమబద్ధీకరించి యాజమాన్య హక్కులు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. ఆ హామీని ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు.

-మిగతా 2 లో



# భారత్‌దే సిరీస్

- రెండో టీ20లోనూ ఆఫ్ఘనిస్తాన్ చిత్తు
- విజృంభించిన నితీష్, అర్ష్‌దీప్
- సంజూ, అభిషేక్ మెరుపులు
- 7 వికెట్లతో టీమిండియా ఘన విజయం

02

ఆఫ్ఘనిస్తాన్‌పై టీమిండియా జోరు కొనసాగింది. రెండో టీ20లోనూ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి.. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో కైవసం చేసుకుంది. నితీశ్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో మెరవగా.. సంజూ శాంసన్, అభిషేక్ శర్మ బ్యాట్‌తో చెలరేగారు. 160 పరుగుల లక్ష్యాన్ని భారత్ 14.5 ఓవర్లలోనే ఛేదించింది.



# నేడు 22ఎపై అసెంబ్లీలో కీలక చర్చ


- సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనపై సర్వత్రా ఉత్కంఠ
- మంత్రులతో ముందుగానే ముఖ్యమంత్రి సమాలోచనలు
- 22ఎ భూముల సమస్యలపై అధికారులకు ఆదేశాలు?
- ప్రతిపక్ష విమర్శలకు సీఎం కౌంటర్ ఇచ్చే అవకాశం
- ధరణి లోపాలపై సభలో వివరించనున్న రేవంత్‌రెడ్డి
- బీఆర్ఎస్ హయాం భూదందాలపై ప్రస్తావన
- ధరణి ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికపై స్పష్టత?
- 22ఎ చర్చ తర్వాత ఎల్‌నినోపై లఘు చర్చ

హైదరాబాద్
అసెంబ్లీ సమావేశాలు బుధవారం ఉదయం పది గంటలకు తిరిగి ప్రారంభం కానున్నాయి. సెక్షన్ 22ఏ అంశంపై చర్చ కొనసాగుతుందని అసెంబ్లీ కార్యదర్శి రేండ్ల తిరుపతి మంగళవారం తెలిపారు. 22ఏ అంశంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం చర్చను ప్రారంభించిన విషయం తెలిసిందే. మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్చార్డీలో మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. 22ఏ అంశం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు,

-మిగతా 2 లో

# తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి

## ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు ముఖ్యమంత్రి ఆహ్వానం



- డిసెంబర్ 7 నుంచి ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్
- విద్య, వైద్యం, పర్యాటక రంగాల్లో భాగస్వామ్యానికి పిలుపు
- ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారాన్ని కోరిన సీఎం రేవంత్
- సిటీ కాలేజ్, ఉస్మానియా ఆస్పత్రి పునరుద్ధరణకు విజ్ఞప్తి
- మూసీ పునరుజ్జీవనంతో నైట్ ఎకానమీకి ప్రణాళిక
- వారసత్వ కట్టడాల పరిరక్షణలో ఫౌండేషన్ పాత్రపై ప్రశంస
- ఫ్యూచర్ సిటీపై ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ ఆసక్తి
- తాజ్ ఫలక్ నుమా ప్యాలెస్ లో ప్రిన్స్ తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

హైదరాబాద్
భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5ను కోరారు. తెలంగాణలోని విద్యా, పర్యాటక, వైద్య రంగాల్లో కలిసి పని చేద్దామని ఆయన విజ్ఞప్తి చేశారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. మంత్రి అజహరుద్దీన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్

-మిగతా 2 లో



# లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్

- ఇప్పటి నుంచే పునాదులు వేస్తున్న హస్తం పార్టీ
- పార్టీ సీనియర్ల పనితీరును సమీక్షిస్తున్న అధిష్ఠానం
- సంస్థాగత పునర్వ్యవస్థీకరణపై దృష్టి సారింపు
- ప్రియాంక గాంధీకి కీలక పాత్ర అప్పగించే అవకాశం
- ద్వంద్వ నమూనాతో కాంగ్రెస్ పార్టీ ముందుకు
- విద్యార్థులతో మమేకమవడం ఈ వ్యూహంలో భాగమే
- జెన్ జెడ్, ఆల్ఫాలను ఆకట్టుకునేందుకు ప్రణాళికలు

న్యూఢిల్లీ:
2029 లోక్‌సభ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే సంస్థాగత పునర్వ్యవస్థీకరణ, ప్రజా చేరువ కార్యక్రమాలపై దృష్టి సారిస్తోంది. పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా కలిసి సీనియర్ నేతల పనితీరును సమీక్షిస్తున్నట్లు సమాచారం. ఇటీవల 130 మంది సీనియర్ నేతలను ఇద్దరూ పరిశీలించినట్లు నివేదికలు వెల్లడించాయి. పార్టీకి ప్రజల్లో మరింత చేరువ కావడం, ముఖ్యంగా యువత, మహిళలు, సామాజిక న్యాయం వంటి అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించడం రాహుల్ గాంధీ ప్రధాన బాధ్యతగా

-మిగతా 2 లో

# మసూద్ అజర్‌పై పాక్ నజరానా పెంపు

- ఆచూకీ తెలిపితే రూ.24 లక్షల బహుమతి
- 2021లో అఫ్ఘాన్‌కు పారిపోయినట్లు వెల్లడి
- కొత్త రెడ్‌బుక్‌లో అజర్ పేరు
- ఎఫ్ఏటీఎఫ్ భేటీ వేళ పాక్ చర్య
- పాక్ ప్రకటనలపై భారత్ విమర్శలు
- గతంలో గ్రే లిస్ట్‌లో పాకిస్థాన్
- ఉగ్ర నిధులపై చర్యలకు ఒత్తిడి
- పఠాన్‌కోట్, పుల్వామా దాడుల్లో నిందితుడు

02



# యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు..

- రూ.2,000 దాటితే 0.4 శాతం ఎండీఆర్
- వినియోగదారులపై ఎలాంటి భారం లేదు
- అక్టోబర్ 15 నుంచి కొత్త ఛార్జీల అమలు
- వ్యాపారులే చెల్లించనున్న ఎండీఆర్
- రూ.75 వేల లావాదేవీపై గరిష్ఠంగా రూ.300
- 95 శాతం లావాదేవీలకు ఛార్జీల నుంచి మినహాయింపు
- చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులకు ప్రత్యేక వెసులుబాటు
- నెలకు రూ.లక్ష దాటితే పెద్ద వ్యాపారులుగా గుర్తింపు




02

# కేంద్రం ఒత్తిడికి తలవంచిన మెటా

- భారత్‌లో కార్యకలాపాలపై కీలక నిర్ణయం
- పిల్లల భద్రతపై మెటా కీలక హామీ
- సైబర్‌క్రైం పోర్టల్‌కు నేరుగా సమాచారం
- బాలల లైంగిక దోపిడీపై కేంద్రం ఆగ్రహం
- హానికర కంటెంట్ గుర్తింపు, తొలగింపుపై దృష్టి
- ఎన్‌సీపీసీఆర్ ముందు మెటా ప్రతినిధుల హాజరు
- ఇన్‌స్టాగ్రామ్ కంటెంట్‌పై ఆరోపణల నేపథ్యంలో విచారణ
- ఇతర సామాజిక మాధ్యమాలకూ కేంద్రం హెచ్చరిక




02

# భారత్‌దే సిరీస్

**-రెండో టీ20లోనూ ఆఫ్ఘనిస్తాన్ చిత్తు**
**- విజృంభించిన నితీష్, అర్ష్‌దీప్**
**- సంజూ, అభిషేక్ మెరుపులు**
**-7 వికెట్లతో టీమిండియా ఘన విజయం**

న్యూఢిల్లీ

ఆఫ్ఘనిస్తాన్‌తో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో కైవసం చేసుకుంది. ఇప్పటికే తొలి మ్యాచ్‌లో సూపర్ విక్టరీ సాధించిన టీమిండియా.. మంగళవారం జరిగిన రెండో టీ20లోనూ అదే జోరు కొనసాగిస్తూ ఆఫ్ఘనిస్తాన్‌ను 7 వికెట్ల తేడాతో మట్టికరిపించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘన్.. భారత బౌలర్లు నితీష్ కుమార్ రెడ్డి (3/24), అర్ష్‌దీప్ సింగ్ (2/35) ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 159 పరుగులు మాత్రమే చేసింది. ఆఫ్ఘనిస్తాన్ బ్యాటర్లలో కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్ (37), రషీద్ ఖాన్ (28), రసూలీ (26) రాణించారు. అనంతరం 160 పరుగుల లక్ష్యాన్ని భారత్.. 14.5 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. సంజూ శాంసన్ (57; 22 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లు) హాఫ్ సెంచరీతో చెలరేగాడు. ఇక రేపు (గురువారం) మధ్య నామమాత్రపు మూడో టీ20 జరగనుంది.

ఓపెనర్ల విధ్వంసం..

లక్ష్యఛేదనకు దిగిన టీమిండియాకు ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ విధ్వంసకర ఆరంభాన్ని అందించారు. తొలి బంతి నుంచే చెలరేగి ఆడిన వీరు ఆఫ్ఘన్ బౌలర్లపై విరుచుకుపడి తొలి వికెట్‌కు కేవలం



38 బంతుల్లోనే 88 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అనంతరం ధాటిగా ఆడుతున్న అభిషేక్ శర్మ (38; 19 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లు) రషీద్ ఖాన్ బౌలింగ్‌లో వెనుతిరిగాడు. తర్వాత ధనాధన్ బ్యాటింగ్‌తో కేవలం 20 బంతుల్లోనే అర్ధ శతకం బాదేసిన శాంసన్ (57) కూడా చివరికి రషీద్ బౌలింగ్‌లోనే ఔటయ్యాడు. అనంతరం కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (11) విఫలమైనా.. ఇషాన్ కిషన్ (38 నాటౌట్), తిలక్ వర్మ (15 నాటౌట్) చివరి వరకు అజేయంగా నిలిచి టీమిండియాను విజయతీరాలకు చేర్చారు. ఆఫ్ఘన్ బౌలర్లలో రషీద్ ఖాన్ 3 వికెట్లు పడగొట్టాడు.

విజృంభించిన తెలుగుకుర్రాడు..

అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘనిస్తాన్‌కు భారత యువ పేస్ ఆల్‌రౌండర్, తెలుగుకుర్రాడు నితీష్ కుమార్ రెడ్డి నిప్పులు చెరిగే బంతులతో హడలెత్తించాడు. ఓపెనర్ గుర్బాజ్ (0)ను అర్ష్‌దీప్ డకౌట్ చేయడంతో ఆఫ్ఘన్ పరుగుల ఖాతా తెరవకుండానే తొలి వికెట్ కోల్పోయింది. తర్వాత మరో ఓపెనర్, కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్.. సిదిఖుల్లా అటల్ (12)తో కలిసి రెండో వికెట్‌కు 51 పరుగులు జోడించాడు. ఈ దశలో బంతి అందుకున్న నితీష్ కళ్లు చెదిరే బంతితో కీలక ఇన్నింగ్స్ ఆడుతున్న ఇబ్రహీం (37)ను వెనక్కి పంపించాడు. తర్వాత గుల్బదీన్ నైబ్ (10)ను కూడా బౌల్డ్ చేసి ఆఫ్ఘనిస్తాన్‌కు మరో భారీ షాకిచ్చాడు. ఈ క్రమంలోనే సిదిఖుల్లాను రవి బిష్ణోయ్.. ప్రమాదకరమైన అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (11)ను అక్షర్ పటేల్ ఇంటిబాట పట్టించారు. అనంతరం ధాటిగా ఆడుతున్న రసూలీ (26)ను అర్ష్‌దీప్ సింగ్ బౌల్డ్ చేయడంతో ఆఫ్ఘన్ 100 పరుగుల వద్ద 6 వికెట్లు కోల్పోయింది. అయితే, ఆఖరిలో ఆల్‌రౌండర్లు రషీద్ ఖాన్ (28), మొహమ్మద్ నబీ (20) రాణించడంతో ఆఫ్ఘనిస్తాన్ నిర్ణీత ఓవర్లలో 159/8 స్కోరు సాధించింది. భారత బౌలర్లలో నితీష్ కుమార్ రెడ్డి 3 వికెట్లతో విజృంభించగా.. అర్ష్‌దీప్ సింగ్ 2 వికెట్లతో సత్తా చాటాడు.

# తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి

(మొదటి తరువాయి)

జాజు, సీఎం సలహాదారు రామకృష్ణారావుతో పాటు పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు, అగా ఖాన్ ఫౌండేషన్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5 తండ్రి, దివంగత ఆగా ఖాన్-4 మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. హైదరాబాద్‌తో ఆగా ఖాన్ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆగా ఖాన్ ఫౌండేషన్‌పై తమకు అత్యంత గౌరవం ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ఫౌండేషన్ తరఫున చేపడుతున్న కార్యక్రమాలను ఆయన కొనియాడారు. తెలంగాణ వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో ఆగా ఖాన్ ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఫౌండేషన్ సహకారంతో శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించుకుని ఇటీవలే ప్రారంభించుకున్న విషయాన్ని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు సీఎం గుర్తుచేశారు. ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారంతో పునరుద్ధరించిన కుతుబ్ షాహీ టూంబ్స్ ప్రారంభోత్సవంలో తాము కలిసిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు.

మూసీ పునరుజ్జీవంపై ప్రత్యేక దృష్టి

మూసీ పునరుజ్జీవనంపై ప్రత్యేక దృష్టి సారించామని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈసా, మూసా నదుల సంగమంగా ఏర్పడిన మూసీ ఆక్రమణలకు గురి కావడంతో పాటు కాలుష్య కోరల్లో చిక్కుకుందన్నారు. మూసీని పునరుజ్జీవింపజేసి నైట్ ఎకానమీని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలోని సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణలో ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారాన్ని సీఎం కోరారు. ఉస్మానియా ఆసుపత్రి కోసం గోషామహల్‌లో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న ఉస్మానియా ఆసుపత్రి భవనాన్ని వారసత్వ సంపదగా గుర్తించి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఫ్యూచర్ సిటీపై ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5 ఆసక్తి

30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఫ్యూచర్ సిటీపై ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్-5 ఆసక్తి కనబరిచారు. ఫ్యూచర్ సిటీని ఎక్కడ నిర్మిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డిని ఆయన ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇందు కోసం సింగపూర్ కంపెనీ మాస్టర్ ప్లాన్ రూపొందిస్తోందని వివరించారు. ఫ్యూచర్ సిటీని నెట్-జీరో సిటీగా ఏర్పాటు చేస్తామని, దాదాపు 15 వేల ఎకరాల్లో గ్రీన్ జోన్ ఉంటుందని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు తెలిపారు. ఇప్పటికే అమెజాన్ వంటి ప్రముఖ సంస్థలు ఫ్యూచర్ సిటీలో తమ కార్యకలాపాలను ప్రారంభించాయని సీఎం వెల్లడించారు.


# నేడు 22ఎపై అసెంబ్లీలో కీలక చర్చ

(మొదటి తరువాయి)

ప్రతిపక్ష పార్టీలు వ్యవహరిస్తున్న తీరుపై చర్చ జరిగినట్టు తెలిసింది. 22ఏ నిషేధిత జాబితా వల్ల సామాన్య ప్రజలకు కలిగిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసే అవకాశమున్నది. ఉద్దేశపూర్వకంగానే ప్రజల భూములు, ఆస్తులను 22ఏ పరిధిలో చేర్చినట్టు ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం అసెంబ్లీలో స్పందించే అవకాశమున్నది. ప్రతిపక్షాలకు సమాధానం చెప్తారని తెలుస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడతారు, ఏం ప్రకటన చేస్తారనే దానిపై అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. 22ఏ వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఏమైనా ఉపశమనం కలుగుతుందా?అన్నదాని కోసం ఎదురుచూస్తున్నారు. ఇంకోవైపు ధరణి పోర్టల్‌లో లోపాల వల్ల బీఆర్ఎస్ హయాంలో భారీగా భూదందాలు జరిగాయనే దానిపై సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వివరించనున్నట్టు తెలిసింది. ముఖ్యంగా మాజీమంత్రి హరీశ్‌రావు, అతని మామ భూబదలాయింపులను ప్రోత్సహించిన అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించనున్నట్టు సమాచారం. బీఆర్ఎస్ నేతల అక్రమ భూదందాలపై విచారణకు అదేశించే అవకాశం లేకపోలేదని తెలుస్తున్నది. ఇప్పటికే ధరణి అక్రమాలపై సెట్ దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. ధరణిపై ప్రభుత్వం ఫోరెన్సిక్ ఆడిట్‌ను నిర్వహించింది. ఆ నివేదికను ఇంకా బహిర్గతం చేయలేదు. దీనిపైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇచ్చే అవకాశముందని తెలిసింది. దీంతో అందరి చూపు బుధవారం జరిగే అసెంబ్లీ సమావేశాలపైనే ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు. 22ఏ అంశంపై చర్చ ముగిసిన అనంతరం ఎల్‌నినో ప్రభావంపై లఘు చర్చ ఉంటుందని అసెంబ్లీ కార్యదర్శి తిరుపతి తెలిపారు

# మసూద్ అజర్‌పై పాక్ నజరానా పెంపు


ఇస్లామాబాద్



జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజర్ ఆచూకీ తెలిపిన వారికి ఇచ్చే నజరానాను పాక్ ప్రభుత్వం రూ.24 లక్షలకు పెంచింది. అజర్ 2021లో అఫ్ఘనిస్థాన్‌కు పారిపోయాడని తన కొత్త రెడ్ బుక్‌లో పాక్ ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ తెలిపింది. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్) అక్టోబర్‌లో సమావేశం కానున్న నేపథ్యంలో పాక్ ఈ చర్యలు తీసుకున్నది. పాక్ నజరానా పెంపుపై భారత్ స్పందిస్తూ.. ఇలాంటి మోసపు ప్రకటనలను ఆ దేశం గతంలో కూడా చేసిందని విమర్శించింది. గతంలో ఎఫ్ఏటీఎఫ్ పాకిస్థాన్‌ను గ్రే లిస్ట్‌లో ఉంచింది.ఉగ్రవాదానికి ఆర్థిక సాయంపై, మనీ లాండరింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఆ సమయంలో పాక్‌పై ఒత్తిడి తెచ్చింది. మళ్లీ ఇప్పుడు అలాంటి ఒత్తిడి ఎదురయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో పాక్ అజర్‌పై ఉన్న నజరానాను పెంచింది. 2016 పఠాన్ కోట్, 2019లో పుల్వామా దాడుల్లో అజర్ నిందితుడిగా ఉన్నాడు.

# కేంద్రం ఒత్తిడికి తలవంచిన మెటా

న్యూఢిల్లీ




భారత్‌లో పిల్లల ఆన్‌లైన్ భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా సోషల్ మీడియా దిగ్గజం మెటా కీలక నిర్ణయం తీసుకుంది. తన ప్లాట్‌ఫామ్‌లపై గుర్తించే పిల్లల భద్రతకు సంబంధించిన కేసులు, ముఖ్యంగా బాలల లైంగిక వేధింపులు, దుర్వినియోగానికి సంబంధించిన ఘటనలను సంబంధిత దర్యాప్తు సంస్థలకు నివేదించేందుకు మెటా అంగీకరించింది. మెటా యాజమాన్యంలోని ప్లాట్‌ఫామ్‌లలో చిన్నారుల లైంగిక వేధింపులు, దోపిడీకి సంబంధించిన కంటెంట్, ప్రకటనలు వస్తున్నట్లు వార్తలు రావడంతో కేంద్రం, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తీవ్రంగా స్పందించాయి.

హానికరమైన కంటెంట్‌ను ముందుగానే గుర్తించి తొలగించడంతో పాటు, నేరాలకు సంబంధించిన సమాచారాన్ని చట్ట అమలు సంస్థలకు అందించాల్సిన బాధ్యతను కూడా ప్రభుత్వం నొక్కిచెబుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై ఉక్కుపాదం మోపుతోంది. దాంతో మెటా ఇకపై పిల్లల భద్రతకు సంబంధించిన అంశాలను ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలోని సైబర్ క్రైమ్ పోర్టల్‌కు నేరుగా నివేదించనుంది. ఇటీవల మెటా ప్రతినిధులు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ముందు హాజరయ్యారు. ఇన్‌స్టాగ్రామ్‌లో బాలల లైంగిక దోపిడీకి సంబంధించిన కంటెంట్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఈ విచారణ జరిగింది. ఈ పరిణామాల మధ్య మెటా తాజాగా నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. పిల్లలకు సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని కల్పించేందుకు ఇది ప్రారంభ అడుగు మాత్రమేనని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు కూడా పిల్లల భద్రతకు సంబంధించి మరింత కఠినమైన చర్యలు తీసుకోవాలని కేంద్రం కోరుతోంది.

# లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్

(మొదటి తరువాయి)

ఉండనున్నట్లు తెలుస్తోంది. యువతతో నేరుగా మమేకమయ్యే కార్యక్రమాలను కాంగ్రెస్ ఇప్పటికే ప్రారంభించింది. సెప్టెంబర్ 19న ఇండోర్‌లో రాహుల్ గాంధీ పాల్గొనే యువజన కార్యక్రమం కూడా ఈ వ్యూహంలో భాగం గా భావిస్తున్నారు. మరోవైపు పార్టీ సంస్థాగత వ్యవహారాలు, ఎన్నికల వ్యూహం, రాష్ట్రాల వారీగా పార్టీ బలోపేతంపై ప్రియాంకాగాంధీకి కీలకపాత్ర అప్పగించే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగు తోంది. ఎన్నికల సమయంలో ప్రచారంతో పాటు కార్యకర్తలను సమన్వయం చేయడంలో ప్రియాంక కు ఇప్పటికే విస్తృత అనుభవం ఉంది. 2029లో రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా ముందుకు తీసుకెళ్లాలనే ఆలోచన కాంగ్రెస్‌లో బలపడుతోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను కూడా 2029 వ్యూహానికి ముందస్తు పరీక్షగా కాంగ్రెస్ భావిస్తోంది. రాహుల్, ప్రియాంక, మల్లికార్జున ఖర్గేలను విస్తృతంగా ప్రచారంలోకి దించేందుకు పార్టీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

సంస్థాగత పునర్నిర్మాణానికి ప్రాధాన్యం

ప్రాథమిక దశగా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) కార్యదర్శుల నియామకంపై పార్టీ దృష్టి కేంద్రీకృతమై ఉంది. రాష్ట్రాలవ్యాప్తంగా క్షేత్రస్థాయి కార్యకలాపాలకు బాధ్యత వహించే 65కు పైగా కార్యదర్శి పదవుల కోసం కఠినమైన పరిశీలన జరుగుతోంది. చారిత్రాత్మకంగా బలహీనమైన సంస్థాగత నిర్మాణాలున్న ప్రాంతాలకు.. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర వంటి కీలక రాష్ట్రాలకు నాయకత్వం ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. 2029లో వాస్తవిక విజయం సాధించాలంటే ఈ పోరాట క్షేత్రాలలో బలమైన ప్రదర్శన అత్యంత కీలకమని నాయకత్వం గుర్తిస్తోంది. యువ నాయకత్వ శ్రేణికి మార్గం సుగమం చేస్తూ, అభ్యర్థుల కార్యచరణ సామర్థ్యం, జెన్ జెడ్ ఓటర్లతో మమేకమయ్యే వారి ప్రతిభ ఆధారంగా వారిని మూల్యాంకనం చేస్తున్నారు.

రాహుల్‌కు ప్రజా చేరువ.. ప్రియాంకకు సంస్థాగత వ్యూహం

సంస్థాగత మార్పులకు అతీతంగా ప్రియాంక గాంధీ వాద్రాకు విస్తృతమైన, నిర్దిష్టమైన వ్యూహాత్మక పాత్రను అప్పగించనున్నట్లు ఇటీవలి పార్టీ చర్చలు సూచిస్తున్నాయి. ఆమె ప్రమేయాన్ని పెంచాలన్న దీర్ఘకాల అంతర్గత విజ్ఞప్తులకు స్పందిస్తూ, 2029 ఎన్నికల కోసం ఒక ఎన్నికల నిర్వహణ వ్యూహ బృందాన్ని ఏర్పాటు చేయాలని పార్టీ యోచిస్తోంది. దీనికి ప్రియాంక నాయకత్వం వహించనున్నట్లు సమాచారం. ఈ ప్రతిపాదిత కమిటీలో ముకుల్ వాస్నిక్, అశోక్ గెహ్లాట్ వంటి అనుభవజ్ఞులైన వ్యూహకర్తలతో పాటు కొత్త, యువతరం నాయకులు కూడా ఉంటారని భావిస్తున్నారు. రాహుల్ గాంధీ విద్యార్థులు, యువతను చేరుకోవడంపై ప్రధానంగా దృష్టి సారిస్తూ దేశవ్యాప్తంగా ప్రజా రక్షణగా కొనసాగుతుండగా.. ప్రియాంక గాంధీ వాద్రా బాధ్యతలు పార్టీ ప్రతిష్టను పెంచడం, ప్రచారాన్ని మెరుగుపరచడం, వ్యూహాలను అమలు చేయడంపై కేంద్రీకృతమై ఉంటాయి. 2024లో వాయనాడ్ నుంచి లోక్‌సభ స్థానాన్ని గెలుచుకుని, క్రియాశీల పార్లమెంట్ సభ్యురాలిగా పనిచేస్తున్నారు. ఆమె కీలకమైన పరిశీలన కమిటీలను, రాష్ట్ర ప్రచార పునర్వ్యవస్థీకరణలను నిర్వహించి పార్టీపై పట్టు సాధించారు. ఉదాహరణకు, అసెంబ్లీ ఎన్నికలకు ముందు అభ్యర్థుల జాబితాలను సిద్ధం చేయడం, స్థానిక పునర్వ్యవస్థీకరణలకు నాయకత్వం వహించడం వంటివి చేశారు. ఈ ముందస్తు సమీకరణ, 2029 ఒక నిజమైన సువర్ణావకాశాన్ని అందిస్తోందన్న కాంగ్రెస్ భావనను ప్రతిబింబిస్తోంది. కీలకమైన సీట్లను దక్కించుకోవడానికి పూర్తిగా ప్రాంతీయ సంకీర్ణ మిత్రపక్షాలపై ఆధారపడకుండా, పార్టీ తన స్వతంత్ర సంస్థాగత ఉనికిని బలోపేతం చేసుకోవాలన్న రాహుల్ గాంధీ అభిప్రాయం ఈ ప్రయత్నాలకు తోడై శక్తిగా ఉంది. గత ఎన్నికలలో ఓటర్ల స్పందనను ప్రభావితం చేసిన లోపాలను సరిదిద్దుకోవడం ద్వారా రాహుల్ బహిరంగంగా, ప్రియాంక వ్యూహాత్మకంగా తోడ్పడే ఉమ్మడి ద్వంద్వ నాయకత్వ నమూనా, అధికారంలో ఉన్న బీజేపీ ఎన్నికల అప్రతిహతాన్ని సవాలు చేయగల పటిష్టమైన పార్టీ నిర్మాణాన్ని నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# రేవంత్ ప్రతి స్కీం వెనుక స్కామ్

(మొదటి తరువాయి)




అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చే పేరుతో ముందుగానే ఒప్పందాలు కుదుర్చుకుని వందల, వేల కోట్ల రూపాయలు దండుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారనే అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షం చెప్పని మాటలను తమకు ఆపాదిస్తూ వక్రీకరణకు పాల్పడుతోందని విమర్శించారు. తమ పార్టీ నాయకుడి మరణాన్ని కోరుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాట్లాడారని, ముఖ్యమంత్రి ప్రోద్బలంతోనే ఇలాంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. దీనికి నిరసనగా తాము ఆందోళన చేపట్టామని, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రధాన ప్రతిపక్షానికి ఉందని స్పష్టం చేశారు.

ప్రతిపక్షం లేవనెత్తుతున్న అంశాలకు సమాధానం చెప్పే సత్తా, సమర్థత ప్రభుత్వానికి లేకపోవడంతోనే తమను శాసనసభ నుంచి సస్పెండ్ చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. సస్పెన్షన్‌తో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రతిరోజూ ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తున్నామని చెప్పారు.

ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల భూ వ్యవహారాలు, 22ఏ పేరుతో జరుగుతున్న అక్రమాలు, 30 శాతం కమీషన్లు, ప్రభుత్వ పెద్దల వ్యాఖ్యలను ప్రజల ముందు నిరంతరం బహిర్గతం చేస్తామని కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వ్యవహారాలను వెలుగులోకి తీసుకువచ్చి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు..

(మొదటి తరువాయి)

యూపీఐ లావాదేవీలపై వసూలు చేసే ఛార్జీలపై కేంద్రం స్పష్టతనిచ్చింది. రూ.2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఛార్జీలు వసూలు చేయనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఎండీఆర్ (మర్చంట్ డిస్కౌంట్ రేట్)గా పిలిచే ఈ ఛార్జీలు వ్యాపారులు మాత్రమే చెల్లించాలి. వినియోగదారులు ఎలాంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ అంశంపై ఎన్‌పీసీఐ (ద నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కీలక వివరాల్ని వెల్లడించింది.దీని ప్రకారం వచ్చే అక్టోబర్ 15 నుంచి ఈ ఛార్జీలు అమలులోకి వస్తాయి. యూపీఐ నుంచి మర్చంట్స్‌కు చేసే చెల్లింపులపైనే ఈ ఎండీఆర్. అలాగే, యూపీఐ నుంచి బ్యాంకులకు, యూపీఐ అకౌంట్లకు చేసే చెల్లింపులు ఎప్పట్లాగే ఉచితం. నిబంధనల ప్రకారం అర్హులైన వ్యాపారులకే ఇది వర్తిస్తుంది. అలాగే, కొన్ని చిన్న వ్యాపారాలు, ప్రత్యేక, అత్యవసర సేవలకు ఈ విషయంలో మినహాయింపు ఉంటుంది. ఈ ఛార్జీలకు సంబంధించి వినియోగదారులకు ఎలాంటి భారం పడదు. రూ.2,000 దాటి చేసే యూపీఐ చెల్లింపులపై, ప్రతి లావాదేవీపై 0.4 శాతం ఎండీఆర్‌ను వ్యాపారులే చెల్లించాలి. గరిష్ఠంగా రూ.300 వరకే ఉంటుంది. సగటు ఛార్జీలు ఇలా ఉంటాయి. రూ.3,000 లావాదేవీపై రూ.12, రూ.50,000 లావాదేవీపై రూ.200, రూ.75,000 లావాదేవీపై రూ.300 డీపీఆర్ చెల్లించాలి. రూ.75,000 దాటినా సరే.. గరిష్ఠంగా ఒక లావాదేవీపై రూ.300 మాత్రమే ఛార్జీ ఉంటుంది. ఎన్‌పీసీఐ చెబుతున్న వివరాల ప్రకారం 95 శాతం యూపీఐ లావాదేవీలు రూ.2,000 కంటే తక్కువగానే ఉంటున్నాయి. అందువల్ల 5 శాతం లావాదేవీలపైనే ఈ ఛార్జీలు ఉంటాయి. వీధి వ్యాపారులు, చిరు వ్యాపారులకు ఈ విషయంలో పీ2పీఎం కింద మినహాయింపు ఉంటుంది. అలాగే, క్యూఆర్ కోడ్ ద్వారా నెలకు రూ.1 లక్ష లావాదేవీ దాటిన వాటిపైనే ఎండీఆర్ చార్జీలుంటాయి. అది రూ.లక్ష లావాదేవీ మూడు నెలలు వరుసగా దాటితే వారిని పెద్ద వ్యాపారులుగా పరిగణిస్తారు.

# అంతరిక్షంలో మా వద్ద ఆయుధాలున్నాయ్..

**న్యూఢిల్లీ**



అంతరిక్షం లో తమ వద్ద ఆయుధాలు ఉన్నాయని అమెరికా తొలిసారి బహిరంగంగా ప్రకటించింది. ఇప్పటికే కొన్ని 'స్పేస్ కంట్రోల్ వెపన్స్ కక్ష్యలో ఉన్నాయని అమెరికా స్పేస్ ఫోర్స్ వెల్లడించింది. శత్రు దేశాల దాడుల నుంచి అమెరికా, మిత్రదేశాల బలగాలను రక్షించేందుకే వీటిని మోహరించినట్లు తెలిపింది. అయితే ఆయుధాల సంఖ్య, వాటి స్థానం, ఏ తరహా వ్యవస్థలను ఉపయోగిస్తున్నారన్న వివరాలను మాత్రం బయటపెట్టలేదు.అమెరికా ఎయిర్‌ఫోర్స్ కార్యదర్శి ట్రాయ్ మెయింక్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. అమెరికా సాయుధ బలగాలపై శత్రు దేశాల నుంచి ఎదురయ్యే ముప్పులను ఎదుర్కొనే సామర్థ్యాలను మరింత పెంచుతున్నామని చెప్పారు. ప్రస్తుతం కక్ష్యలోనే శత్రు చర్యలను ఎదుర్కోగల అంతరిక్ష ఆయుధాలు ఉన్నాయని స్పష్టంచేశారు. ఈ ఆయుధాలు 'కైనెటిక్, నాన్-కైనెటిక్' విధానాల్లో పనిచేయగలవని స్పేస్ ఫోర్స్ తెలిపింది. అవసరాన్ని బట్టి రక్షణతోపాటు దాడి చర్యల్లోనూ వీటిని ఉపయోగించవచ్చని పేర్కొన్నది.అయితే అవి ఉపగ్రహాలను ధ్వంసం చేసే ఆయుధాలా, ఇతర రకాల వ్యవస్థలా అన్నదానిపై స్పష్టత ఇవ్వలేదు. అంతరిక్ష రంగంలో చైనా, రష్యాల నుంచి ముప్పు పెరుగుతోందని అమెరికా భావిస్తోంది. ఉపగ్రహాలు సైనిక కమ్యూనికేషన్లు, నిఘా, నావిగేషన్‌కు కీలకం కావడంతో వాటిపై ఆధిపత్యం భవిష్యత్ యుద్ధాల్లో కీలకంగా మారనుంది. ఈ నేపథ్యంలో అమెరికా తొలిసారి కక్ష్యలో ఆయుధాల ఉనికిని బహిరంగంగా అంగీకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. 1967 నాటి ఔటర్ స్పేస్ ట్రీటీ అంతరిక్షంలో సామూహిక విధ్వంసక ఆయుధాల మోహరింపును నిషేధిస్తుంది.

## జనసంద్రంగా మారిన సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి

# ఉచిత కంటి వైద్య శిబిరం

- 5వ రోజు సుంకిరెడ్డి ఉచిత కంటి వైద్య శిబిరానికి పోటెత్తిన జనం
- ప్రారంభమైన కంటి శుక్లాల ఆపరేషన్ల ప్రక్రియ పూర్తి
- నేటితో ముగియనున్న ఉచిత కంటి పరీక్షల ప్రక్రియ





**ఆమనగల్లు, సెప్టెంబర్ 15(నేటి దర్శిని);** కడ్తాల్ పట్టణంలోని ఎంబీఏ గార్డెన్స్ లో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. గత ఐదు రోజుల్లో 4240 మందికిపైగా ప్రజలు శిబిరాన్ని సందర్శించగా 2762 మందికిపైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహణ, 1670 మందికిపైగా ఉచిత కంటి అద్దాల పంపిణీ, 142 మంది కి కంటి శుక్లాల పేషంట్ల కు ఉచిత ఆపరేషన్ల ను శంకర నేత్రాలయ, చెన్నై కంటి వైద్య నిపుణులచే నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ కడ్తాల్ లో నిర్వహిస్తున్న ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి రోజురోజుకు ప్రజల నుంచి స్పందన పెరుగుతోందని, ఐదో రోజు ఒక్కరోజే 1200 మందికి పైగా ప్రజలు శిబిరాన్ని సందర్శించడం ఎంతో సంతోషంగా ఉందని, వీరిలో 812 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించగా 500 మందికి పైగా ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. కంటి సమస్యలను చాలామంది ప్రారంభ దశలో గుర్తించలేకపోతున్నారని, ఆర్థిక పరిస్థితులు, వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో కొందరు కంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారని, అలాంటి వారికి తమ ప్రాంతంలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని సుంకిరెడ్డి తెలిపారు. ప్రజలు కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేసుకోవాలని, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు,రోజువారి కూలీలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి శుక్లాల ఆపరేషన్లు సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు ఎంపికైన పేషెంట్లకు వైద్యుల సూచనల మేరకు విడతలవారీగా ఉచిత ఆపరేషన్లు నిర్వహించనున్నామని, అలాగే రేపటితో కంటి పరీక్షల ప్రక్రియ ముగియనుందని, కడ్తాల్ మండలం, పరిసర గ్రామాల ప్రజలు కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని శిబిరానికి హాజరై ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకోవాలని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు పాలకుర్ల మహేందర్ గౌడ్, కరుణాకర్ గౌడ్, రవికుమార్, రామ్ చందర్ నాయక్, పొగాకు సంధ్య రాణి వెంకటేష్, వార్డు సభ్యులు నాగరాజు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు ,తల్లోజు రఘు, ఎగిరిశెట్టిస్ లింగం, నరేందర్ గౌడ్ జగన్ చంద్రశేఖర్ కొండల్ యాదవ్ ,రమేష్ యాదవ్, శ్రీపతి శేఖర్ ,మల్లేష్ నాయక్, శ్రీను, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాలకు అండదండలా..?

- ప్రశ్నించిన వారిపై ప్రతాపమా..?
- అక్రమ నిర్మాణాలపై ప్రశ్నిస్తే ఆగ్రహం..
- అధికారుల తీరుపై స్థానికుల్లో అనుమానాలు







**పటాన్‌చెరు, సెప్టెంబర్ 15 (నేటి దర్శిని)** మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, నిబంధనల ఉల్లంఘనలపై ప్రశ్నలు తలెత్తుతున్న వేళ అధికారుల వ్యవహారశైలి చర్చనీయాంశంగా మారుతోంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయంటూ ఫిర్యాదులు వస్తున్నప్పటికీ వాటిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ప్రశ్నించే వారిపైనే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, అక్రమాలపై సమాచారం కోరడం ప్రజాస్వామ్య హక్కులో భాగమే. అయితే సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సింది పోయి ప్రశ్నించిన వారిపైనే ప్రతాపం చూపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అసలు అక్రమాలను ఎవరు ప్రోత్సహిస్తున్నారు? వాటిపై చర్యలు ఎందుకు కనిపించడం లేదు? అనే ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి.ముఖ్యంగా భవన నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు, లేఅవుట్లు, ప్రభుత్వ భూముల వినియోగం, సెల్లార్లు, వాణిజ్య షట్టర్లు తదితర అంశాలపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలను ఉల్లంఘించిన నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు అంటున్నారు.

### అక్రమాలను ప్రశ్నిస్తే కోపమెందుకు..?

అక్రమాలు లేవని అధికారులు భావిస్తే, వచ్చిన ఫిర్యాదులపై పారదర్శకంగా విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు. తప్పులు ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అక్రమాలు లేవంటే ఆధారాలతో స్పష్టం చేయాలని అంటున్నారు. ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా ప్రశ్నించిన వారిపైనే ఆగ్రహం వ్యక్తం చేయడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొంటున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను అణచివేయడం కాకుండా వాటిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, అక్రమ నిర్మాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించి సమగ్ర విచారణ చేపట్టాలని, మున్సిపల్ పరిధిలో అనుమతులు, నిర్మాణాలపై పారదర్శకత తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

## మున్ననూర్ ముద్దుబిడ్డలకు

# ఘన సన్మానం

- రాష్ట్ర, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సర్పంచ్ చిట్టెంపల్లి సుజాత మల్లికార్జున్ రెడ్డి ఘన సత్కారం





**మిడ్జిల్, సెప్టెంబర్ 15 (నేటి దర్శిని):** మిడ్జిల్ మండలంలోని మున్ననూర్ గ్రామానికి చెందిన రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత విష్ణువర్ధన్ గౌడ్, జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లక్ష్మయ్యలను గ్రామ సర్పంచ్ చిట్టెంపల్లి సుజాత మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డులు అందుకోవడం మున్ననూర్ గ్రామానికే గర్వకారణమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ స్వామి రెడ్డి పాల్గొని అవార్డు గ్రహీతలను అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో గుర్తింపు పొందడం ఇతరులకు స్ఫూర్తిదాయకమని అన్నారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

## పార్టీలకు అతీతంగా


# ఒక్కటైన నేతలు..

- మాజీ సర్పంచ్ సాయిబాబుకు ఘన నివాళి



**మిడ్జిల్, సెప్టెంబర్ 15, (నేటి దర్శిని ):** మిడ్జిల్ గ్రామ మాజీ సర్పంచ్ కమ్మరి సాయిబాబు 18వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. మిడ్జిల్ మండల కేంద్ర పరిధిలోని జాతీయ రహదారి వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసిమెలిసి ఐకమత్యంతో కార్యక్రమంలో పాల్గొని సాయిబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.మాజీ సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కమ్మరి సాయిబాబు చేసిన సేవలను పలువురు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రజలతో మమేకమై పనిచేసిన ఆయన సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని నాయకులు పేర్కొన్నారు.పార్టీలకు అతీతంగా నాయకులు, ప్రజాప్రతినిధులు ఒకే వేదికపైకి వచ్చి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించడం మిడ్జిల్‌లో సాయిబాబుకు ఉన్న ప్రజాభిమానానికి నిదర్శనంగా నిలిచింది.

# గట్టి ఇప్పలపల్లిలో ఘనంగా మద్దెలమ్మ బోనాలు







**తలకొండపల్లి, సెప్టెంబర్ 15, ( నేటి దర్శిని):** తలకొండపల్లి మండలం గట్టి ఇప్పలపల్లి గ్రామంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మద్దెలమ్మ బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మద్దెలమ్మ దేవాలయ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పద్మశాలి మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై బోనాలను సమర్పించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. గ్రామ ప్రజలు అమ్మవారిని దర్శించుకుని, గ్రామంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు నెలకొనాలని ప్రార్థించారు. సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలను కొనసాగించేందుకు ప్రతి ఏడాది బోనాల వేడుకలను నిర్వహిస్తున్నట్లు పద్మశాలి సంఘం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం, సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

# పైలట్ ప్రాజెక్టుగా గొల్లపల్లి ఎంపిక

- వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికకు శ్రీకారం
- 316 వ్యక్తిగత, సామాజిక పనుల గుర్తింపు.. ఉపాధి హామీపై తొలి గ్రామసభ







**చింతపల్లి, సెప్టెంబర్ 15 (నేటి దర్శిని):** చింతపల్లి మండలంలోని గొల్లపల్లి గ్రామపంచాయతీ పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైంది. వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికలో భాగంగా గ్రామ సమగ్ర అభివృద్ధికి చేపట్టాల్సిన 316 వ్యక్తిగత, సామాజిక పనులను గుర్తించేందుకు ఉపాధి హామీ పథకం తొలి గ్రామసభను మంగళవారం గొల్లపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అధికారి గోవిందయ్య, ఎంపీడీవో సుజాత ముఖ్య అతిథులుగా హాజరై గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపకల్పన, పనుల ఎంపిక, నిధుల వినియోగం, ప్రజల భాగస్వామ్యంపై వివరించారు.

ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి ప్రణాళిక

గ్రామ అవసరాలు, వనరులు, ప్రజల జీవనోపాధి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికను రూపొందించనున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామంలోని వనరులను గుర్తించడం, భౌగోళిక పరిస్థితులను పరిశీలించడం, పేదరికం--జీవనోపాధి అవసరాలను అంచనా వేయడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

మహిళలతో మహిళా సభలు, చిన్నారులతో బాల--బాలికల సభలు నిర్వహించి వారి సమస్యలను కూడా ప్రణాళికలో చేర్చనున్నట్లు తెలిపారు. తుది ప్రణాళికను గ్రామసభలో ప్రజల ముందుంచి ఆమోదం పొందిన అనంతరం ఈ--గ్రామ్ స్వరాజ్ ద్వారా నమోదు చేయనున్నట్లు వివరించారు.

నీటి భద్రతకు పెద్దపీట

గ్రామంలో చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు, భూగర్భ జలాల పెంపు వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. పారిశుధ్యం, చెత్త నిర్వహణ, తడి--పొడి చెత్త వేరు చేయడం, ద్రవ వ్యర్థాల నిర్వహణ వంటి పనులు చేపట్టేలా ప్రణాళిక రూపొందించనున్నారు.

రోడ్లు.. డ్రైనేజీలు.. పాఠశాలల అభివృద్ధి

గ్రామీణ మౌలిక సదుపాయాల కింద అంతర్గత సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, పశుసంవర్ధక షెడ్లు, మహిళా సంఘాల స్వయం ఉపాధికి అవసరమైన మౌలిక వసతులను కూడా ప్రణాళికలో చేర్చనున్నట్లు అధికారులు తెలిపారు.

పచ్చదనం.. పర్యావరణ పరిరక్షణ

వాతావరణ మార్పుల ప్రభావాన్ని తట్టుకునేలా మొక్కల పెంపకం, రహదారుల వెంట మొక్కలు నాటడం, హరిత కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. గ్రామాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దేలా ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు.

వివిధ నిధుల అనుసంధానం

ప్రణాళిక అమలుకు 15వ ఆర్థిక సంఘం నిధులు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు, పంచాయతీ సొంత ఆదాయాన్ని అనుసంధానం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఉపాధి హామీ పనుల్లో శ్రమ--సామగ్రి నిష్పత్తిని 60:40గా పాటించనున్నట్లు వివరించారు. మంజూరైన పనులకు సంబంధించిన వివరాలు, చిత్రాలు, భౌగోళిక గుర్తింపు ద్వారా పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఈ కార్యక్రమంలో గొల్లపల్లి సర్పంచ్ అనంతుల శ్రీనుగౌడ్, ఉప సర్పంచ్ గోరేటి మహేష్, ప్రత్యేక అధికారి గోవిందయ్య, ఎంపీడీవో సుజాత, ఏపీఎం నరసింహ, సీసీ నరసింహ, ఎంపీవో ఇన్‌చార్జి మురళి, ఏపీవో సుమీర్, సాంకేతిక సహాయకుడు రాజు, పంచాయతీ కార్యదర్శి హరి, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుగుణమ్మ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ, వార్డు సభ్యులు, గ్రామస్తులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జన ఏర్పాట్లపై అధికారుల పరిశీలన

- షాద్‌నగర్ శిరీష, ఏసీపీ లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి, పట్టణ సీఐ సీతారాం సందర్శన



**రంగారెడ్డి జిల్లా , సెప్టెంబర్ 15 (నేటి దర్శిని):** వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అధికారులు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. షాద్‌నగర్ పట్టణంలోని బొబ్బిలి చెరువు, బుచ్చిగూడ రోడ్డు సమీపంలోని చెరువులను డీసీపీ శిరీష, ఏసీపీ లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి, పట్టణ సీఐ సీతారాం సందర్శించారు.ఈ సందర్భంగా నిమజ్జన ప్రదేశాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు నిమజ్జనానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పెంటయ్య, రాజు నాయక్, శ్రీశైలం గౌడ్, మున్సిపల్ ఏఈ సాయి కిరణ్, ఇలియాస్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# చలో గోల్కొండ మహాపాదయాత్రను విజయవంతం చేయాలి

- తెలంగాణ రాజ్యాధికార పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎమ్మె సంతోష్



**రంగారెడ్డి జిల్లా , సెప్టెంబర్ 15 (నేటి దర్శిని):** తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17న గోల్కొండ కోట నుంచి నిర్వహించనున్న మహాపాదయాత్రను విజయవంతం చేయాలని షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎమ్మె సంతోష్ పిలుపునిచ్చారు. షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మె సంతోష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం సాధించాలనే లక్ష్యంతో తీన్మార్ మల్లన్న చేపడుతున్న మహాపాదయాత్రకు షాద్‌నగర్ నియోజక వర్గంలోని అన్ని వర్గాల ప్రజలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మద్దతు ఇవ్వాలని కోరారు.టీఆర్పీ జిల్లా అధికార ప్రతినిధి భూస జంగన్న మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు అణగారిన, పీడిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తీన్మార్ మల్లన్న నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. బహుజన వర్గాల హక్కులు, రాజ్యాధికారం కోసం చేపడుతున్న ఈ ఉద్యమానికి అన్ని బహుజన వర్గాలు మద్దతు ప్రకటించి మహాపాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తాలూకా ఉపాధ్యక్షుడు మీది కేరి రాధాకృష్ణ, కొందుర్గు మండల అధ్యక్షుడు దర్గ వెంకటేష్, కాశ యాదయ్యతో పాటు టీఆర్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామ సమస్యల పరిష్కారానికి ఎంపీడీఓ కు వినతిపత్రం

- కాలుష్య నివారణ, భూ సమస్యలపై చర్యలు తీసుకోవాలని వినతి



**తలకొండపల్లి, సెప్టెంబర్ 15 (నేటి దర్శిని):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం సంగాయపల్లి (రాంపూర్) గ్రామంలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ ప్రజలు, యువకులు మంగళవారం ఎంపీడీఓ ను కలిసి వినతిపత్రం సమర్పించారు.గ్రామంలో నెలకొన్న కాలుష్య సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, గ్రామ పరిధిలో జరుగుతున్నట్లు తమకు సమాచారం ఉన్న భూ అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని వారు కోరారు. అలాగే గ్రామ కంఠం భూమిని అధికారికంగా సర్వే చేసి, కొలతలు నిర్వహించి, సరిహద్దులను గుర్తించి గ్రామ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.గ్రామస్తుల సమాచారం ప్రకారం గ్రామ కంఠం భూమి మొత్తం సుమారు 11 ఎకరాలు ఉండగా, ప్రస్తుతం సుమారు 8.5 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు వారు పేర్కొన్నారు. మిగిలిన భూమికి సంబంధించిన వివరాలను అధికారిక రికార్డుల ఆధారంగా పరిశీలించి, పూర్తిస్థాయి సర్వే నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలని కోరారు.గ్రామ ప్రజల సమస్యలను పరిశీలించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని కాలుష్య నివారణ, భూ సమస్యలపై విచారణ, గ్రామ కంఠం భూమి పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని వారు MPDOను కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పడకల్ పార్టీ కార్యదర్శి జై పెంటయ్య, పార్టీ సభ్యులు పర్వతాలు, మహేష్, గట్టి ఇప్పలపల్లి సీపీఐ(ఎం) పార్టీ కార్యదర్శి కె. చెన్నయ్య, సభ్యులు డి. చెన్నయ్య, దైవానందం, సంగాయపల్లి సీపీఐ(ఎం) పార్టీ కార్యదర్శి నాగరాజు, దిలీప్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సరికొత్త మోడల్ బాలేనో కార్ ఆవిష్కరణ


- ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 15 (నేటి దర్శిని):** షాద్‌నగర్ పట్టణ పరిధిలోని మహబూబ్ నగర్ రోడ్డులో గల నెక్సా షోరూంలో సరికొత్త మోడల్ 'బాలెనో కారు ఘనంగా ఆవిష్కృతమైంది.ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి సరికొత్త కారును లాంచ్ చేశారు.ఈ సందర్భంగా షోరూం ప్రతినిధులు మొదటగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి ఘనస్వాగతం పలికారు. అనంతరం షోరూంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం,వినూత్న డిజైన్,మెరుగైన మైలేజ్ మరియు అధునాతన భద్రతా ప్రమాణాలతో ఈ న్యూ మోడల్ బాలెనో కారును మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు నిర్వాహకులు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి వెల్లడించారు.కారును ఆవిష్కరించిన అనంతరం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వాహనంలోని సరికొత్త ఫీచర్లను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో నెక్సా షోరూమ్ నిర్వాహకులు, సిబ్బంది, కౌన్సిలర్లు బిఎస్ సుధీర్,గౌస్ జానీ,మాజీ కౌన్సిలర్లు కానుగు అనంతయ్య,చింటు ప్రతాప్ రెడ్డి,నందీశ్వర్,ఈశ్వర్ రాజు, యుగేందర్,చెట్ల నరసింహ,చిన్న యాదగిరి, పాలమకుల చెన్నయ్య, కంటెస్టెంట్ కౌన్సిలర్లు నక్కల వెంకటేష్ గౌడ్,సలీం,మాజీ ఎంపిటిసి అశోక్ రెడ్డి,మాజీ సర్పంచ్ హరినాయక్, నాయకులు బిలాల్,శేరి శ్రీనివాస్ రెడ్డి,బంకు శ్రీను,శ్రీకాంత్ గౌడ్,నడికూడ సంతు యాదవ్,అల్లాడ శేఖర్,మల్లేష్,రమేష్ నాయక్, మహిపాల్ గౌడ్, గోపాల్ గౌడ్, సాయి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా జరిపించిన మహబూబ్నగర్ మేయర్ గుమ్మాల్ మమత





**మిడ్జిల్, సెప్టెంబర్ 15,( నేటి దర్శని మహబూబ్ నగర్జిల్లా బ్యూరో ):** మహబూబ్ నగర్ మేయర్ గుమల్ మమత వినాయక చవితి సందర్భంగా

క్రాంతి నగర్ కాలనీలో వినాయక ఉత్సవాలను ఘనంగా జరిపించారు. మరియు ఐమాక్స్ లైట్ ఓపెనింగ్ చేసి కాలనీవాసుల కళ్ళల్లో వెలుతురు చూశారు. కాలనీవాసులు మేయర్ ని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. మేయర్ గుమాల్ మమతా వినాయక చవితి ఉత్సవాల భాగంగా ఆమె అక్కడ వచ్చి పూజా కార్యక్రమాలు చేసి వివిధ అభివృద్ధి పనులు నేను ముందుండీ చేపిస్తానని కాలనీ వాళ్లకు హామీ ఇచ్చి మూడో డివిజన్, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తానని మాట ఇవ్వడం హాయ్ మ్యాక్స్ లేట్ ఓపెనింగ్ చేసి, వాళ్లతో ముచ్చటించి ఈ సందర్భంగా కాలనీవాసులు సంతోషంగా వ్యక్తం చేశారు ఇలాంటి నాయకులు మాకు ఉన్నందుకు ఏ లాంటి ఇబ్బందులు లేవు,అని చెప్పి కానీ వాసులు హర్షం వ్యక్తం చేశారు

## బాలాపూర్ గణనాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్



**బడంగ్‌పేట్, సెప్టెంబర్ 15 (నేటి దర్శిని):** జీహెచ్ఎంసీ శంషాబాద్ జోన్ పరిధిలోని బడంగ్‌పేట్ సర్కిల్ బాలాపూర్ గ్రామంలో కొలువుదీరిన విఘ్నేశ్వరుడిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, సీపీ సజ్జనార్ తదితరులు గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ప్రముఖులను శాలువాలతో సత్కరించి, బాలాపూర్ గణేష్ లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వృక్షం నేల కూలడంతో తప్పిన పెను ప్రమాదం....!



**ఉమ్మడి వరంగల్, సెప్టెంబర్ 15(నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ నగరంలోని హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలో భారీ వృక్షం ఒక్కసారిగా నేల కూలడముతో అక్కడే నిలిచి ఉన్న రెండు బైకులు, మూడు ఆటోలు తీవ్రంగా దెబ్బతినినుజ్జునుజ్జయ్యాయి. ఆ సమయంలో అటుగా వెళు తున్న బస్సులోని ప్రయాణికులు తీవ్రభయాందోళనకు గురైనారు. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## పాలిటెక్నిక్ విద్యార్థులు ఎంజీఎం కూడలిలో రాస్తారోకో



**ఉమ్మడి వరంగల్, సెప్టెంబర్ 15 (నేటి దర్శిని బ్యూరో):** పాలిటెక్నిక్ విద్యార్థులు తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వరంగల్ ఎంజీఎం కూడలిలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. విద్యార్థుల ఆందోళనలతో ఎంజీఎం ప్రధాన పరిసరాల్లో కొద్దిసేపు ట్రాఫిక్ అంతరాయము ఏర్పడింది. తమ సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని విద్యార్థులు తెలిపారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని పర్యవేక్షించారు.

## పర్యావరణ పరిరక్షణకు
# మట్టి గణపతులే శ్రేయస్కరం



- **కాణిపాక వినాయకుడి రూపంలో విగ్రహం తయారుచేసిన యువతులు**
- **ఆమనగల్లు సత్యసాయి మందిరంలో మట్టి గణపతికి ప్రతిష్టాపన, పూజలు**

**ఆమనగల్లు, సెప్టెంబర్ 15(నేటి దర్శిని);** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని, సమస్త మానవాళికి చాటి చెప్పేలా ఆమనగల్లు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఆమనగల్లు లోని సత్యసాయి మందిరంలో కాణిపాక వినాయకుడి రూపంలో వరిగడ్డి, మట్టితో ప్రత్యేకంగా తయారు చేసిన గణపతి విగ్రహాన్ని ప్రతిష్టించి పూజలను నిర్వహించారు. జేఎన్టీయూ కళాశాలలో కళల విద్యను అభ్యసిస్తున్న టింగిరికార్ సాయి సుష్మ, సాయి కీర్తి భక్తిశ్రద్ధలతో ఈ మట్టి గణపతి విగ్రహాన్ని స్వయంగా రూపొందించారు. కళ నైపుణ్యాన్ని వినియోగిస్తూ పర్యావరణానికి హాని కలగని విధంగా సహజ పదార్థాలతో గణపతిని తయారు చేయడం పలువురిని ఆకట్టుకుంది. స్థానిక సత్యసాయి సేవాసమితి కన్వీనర్ దొంతు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేశ పూజ కార్యక్రమంలో ఈ కాణిపాక గణపతి విగ్రహాన్ని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి సుష్మ, సాయి కీర్తిలను అభినందిస్తూ పర్యావరణ పరిరక్షణ కోసం ఇలాంటి మట్టి గణపతులను తయారు చేయడం అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రస్తుతం వినాయక చవితి సందర్భంగా వివిధ రకాల విగ్రహాలు అందుబాటులో ఉన్నప్పటికీ, సహజ సిద్ధమైన మట్టి, వరిగడ్డితో స్వయంగా విగ్రహాన్ని తయారుచేసి పూజించడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. ముఖ్యంగా పిఓపితో తయారయ్యే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున మట్టి గణపతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. మట్టి గణపతుల నిమజ్జనంతో



చెరువులు, నీటి వనరులు పరిశుభ్రంగా ఉండటంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని, పూర్వకాలంలో సహజ పదార్థాలతో గణపతి విగ్రహాలను తయారు చేసుకొని పూజించిన సాంప్రదాయాన్ని నేటి తరానికి కూడా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నిర్వాహకులు తెలిపారు. మార్పు మన నుంచే ప్రారంభం కావాలని, సత్య సాయి మందిరం నుంచి మట్టి గణపతి తయారీకి శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందని సాయి మందిర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు అన్నారు. విగ్రహాన్ని తయారుచేసిన యువతులు సాయి సుష్మ, సాయి కీర్తి మాట్లాడుతూ భక్తితో తయారుచేశాం కలలపై తమకున్న ఆసక్తితో పాటు భగవాన్ సత్యసాయి బాబా వారిపై ఉన్న భక్తితో తొలిసారిగా స్వామివారి మందిరం కోసం కానిపాక వినాయకుడి రూపంలో మట్టి గణపతిని తయారు చేశామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే మట్టి గణపతులను మరింతగా తయారు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. ప్రభుత్వం సైతం మట్టి గణపతులను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో సహజ పదార్థాలతో వినాయక విగ్రహాలను తయారు చేయడం ఎంతో శ్రేష్టమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దొంతు శ్రీను, బ్రహ్మం, దాస శ్రీనివాస్, పోలిశెట్టి శ్రీనివాస్,ఆనంద్, శేఖర్, ఆమనగంటి సంజీవ్ కుమార్,రాము, కృష్ణారెడ్డి, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలి

- **ఎంపీ, దిశా కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ కడియం కావ్య**
- **వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి**
- **విద్య, వైద్య రంగాలను మరింత బలోపేతం చేయాలి**
- **ప్రజలకు మరింత చేరువయ్యేలా వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలి**
- **సమగ్ర జిల్లా అభివృద్ధే ధ్యేయంగా అధికారులు మరింత బాధ్యతతో పని చేయాలి**
- **కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలి**




**ఉమ్మడి వరంగల్, సెప్టెంబర్ 15 (నేటి దర్శిని బ్యూరో):** జిల్లా అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో చేరేలా అధికారులుబాధ్యతాయుతంగా పని చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు, జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ (దిశా) కమిటీ చైర్ పర్సన్ డా.కడియం కావ్య అధికారులను అదేశించారు.మంగళవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, పురోగతిపై జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ (దిశా) కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య అందించడం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తీసుకుంటున్న ప్రత్యేక చొరవ అభినందనీయమని వరంగల్ పార్లమెంట్ సభ్యులు, దిశా కమిటీ చైర్ పర్సన్ డా.కడియం డా.కడియం కావ్య పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి, అర్హులైన లబ్ధిదారులకు వాటి ప్రయోజనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎంపీ ల్యాడ్స్ నిధుల కింద మంజూరు చేసిన మూడు నెలల్లో పనులు ప్రారంభం కాకపోతే వెంటనే వాటిని రద్దు చేయాలని, వినియోగించిన నిధులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నవీకరించాలని అధికారులను ఆదేశించారు.
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించిన పారక్వాట్ గడ్డి మందు వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని, పారక్వాట్ వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.పిల్లల్లో మానసిక వైకల్యాన్ని పాఠశాల స్థాయిలోనే గుర్తించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మానసిక సమస్యలను తగ్గించేందుకు సరైన శిక్షణ, మార్గదర్శకత్వం అందించాలని చెప్పారు.
విద్యార్థుల్లో రక్తహీనతను అంగన్‌వాడీ, ప్రీ-ప్రైమరీ దశ నుంచే గుర్తించాలని, పోషకాహారం, అవసరమైన మందులు అందించడంతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.జాతీయ రహదారి--163లో మిస్సింగ్ సర్వీస్ రోడ్ల నిర్మాణ పురోగతిపై నేషనల్ హైవేస్ అధికారుల ద్వారా వివరణ అడిగి తెలుసుకున్నారు. రాఘవాపురం వద్ద వర్షపు నీరు జాతీయ రహదారిపై నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. చాగల్, ఘనపూర్, పెద్దపెండ్యాల ప్రాంతాల్లో నిర్మించిన సైడ్ డివైడర్లు ఉపయోగకరంగా లేవని పేర్కొని, వాటిని సరిచేయాలని ఆదేశించారు.జిల్లాలో మాదకద్రవ్యాలు, ఇతర మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని సూచించారు. అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, గుడ్ టచ్--బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.
జిల్లాలో ఇప్పటికే అమలు చేస్తున్న కార్యక్రమాలతో పాటు మరిన్ని వినూత్న ఆలోచనలను ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. కొత్త కార్యక్రమాలను కేవలం ప్రారంభించడమే కాకుండా, వాటి ప్రయోజనాలు విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లేలా సమర్థవంతమైన అవగాహన, ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతమవుతాయని వెల్లడించారు.ఈ దిశా సమావేశంలో స్టేషన్ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగాం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డి సి పి రాజమహేంద్ర నాయక్ , అదనపు కలెక్టర్, ఆర్డీఓలు గోపీరాం, కిరణ్ ప్రకాష్, మునిసిపల్ కమిషనర్లు రాజశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ, అన్ని శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగాలు కల్పించాలి

- **సూర్యాపేట నుంచి గాంధీ భవన్ వరకు త్వరలో సాంస్కృతిక సేన పాదయాత్ర**

**సూర్యాపేట, సెప్టెంబర్ 15 (నేటి దర్శిని):** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగాలు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సాంస్కృతిక సేన సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, ఐఎన్‌టీయూసీ తుంగతుర్తి నియోజకవర్గం అధ్యక్షుడు ఎర్ర అనుదీప్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌లోని గాంధీ భవన్ వరకు త్వరలో పాదయాత్ర చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం గాంధీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎర్ర అనుదీప్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కళాకారులు అహర్నిశలు శ్రమించారని, కాలికి గజ్జె కట్టి గ్రామగ్రామాన తిరుగుతూ ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని




రగిలించారని పేర్కొన్నారు. ఒక పూట తిండి తింటూ, మరో పూట పస్తులుండి సైతం రాష్ట్ర సాధన ఉద్యమంలో ముందువరుసలో నిలిచిన కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. తెలంగాణ గడ్డపై ఏర్పడిన ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి ఉద్యమ నిరుద్యోగ కళాకారుడికి ఉద్యోగావకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చుతుందనే నమ్మకం తమకు ఉందన్నారు. రాష్ట్రంలోని కవులు, కళాకారులు ఎవరూ అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని, అర్హులైన ఉద్యమ నిరుద్యోగ కళాకారులందరికీ త్వరలోనే ఉద్యోగాలు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సాంస్కృతిక సేన సూర్యాపేట జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గుగులోతు మౌనిక, జిల్లా ప్రధాన కార్యదర్శి తడకమల్ల పరశురామ్, మీసాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

WWW.NETIDARSHINI.COM
RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక
www.epaper.netidarshini.com
బుధవారం 16-09-2026

# గణేష్ నిమజ్జనంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులులేకుండా చర్యలు తీసుకోవాలి

- మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్



**ఆమనగల్లు,సెప్టెంబర్ 15 (నేటి దర్శిని):** గణేష్ నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆ మనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ అన్నారు. పట్టణంలోని సుర సముద్రం చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను పత్య నాయక్, కమిషనర్ రాఘవేందర్ రెడ్డి సీఐ ఎస్. వెంకటేశ్వర్లు తో కలిసి మంగళవారం పరిశీలించారు.చెరువు కట్ట,నిమజ్జన ఘాట్, లైటింగ్, పోలీస్ బందోబస్తు ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా పత్య నాయక్ మాట్లాడుతూ...

సుర సముద్రంలో ప్రతి సంవత్సరం 150కు పైగా గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేస్తారని భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

చెరువులో నీటిని 2 రోజుల ముందునే పరీక్ష చేసి, లోతు తగ్గించి నిమజ్జనానికి అనుకూలంగా చేయాలని, ఘాట్ దగ్గర జేసీబీ, క్రేన్, జనరేటర్, లైట్లు, బారికేడ్లు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. పోలీస్, మెడికల్, ఫైర్ సేఫ్టీ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని

తాగునీరు,షామియానా, ట్రాఫిక్ డైవర్షన్ బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు,ఎస్సై సంతోష్ రెడ్డి, కౌన్సిలర్లు ముక్తాల వెంకటయ్య, నాగిళ్ల జగన్, అనుష శ్రీశైలం, ఎర్రవోలు మహేష్, ధోని, మాల్యా, సురేష్, కుమార్ గౌడ్, రామకృష్ణ, షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో ప్రజాకళా జాతర కరపత్రం ఆవిష్కరణ

- అరుణోదయ విమలక్క 50 ఏళ్ల విప్లవ ప్రజా సాంస్కృతిక ఉద్యమ ప్రస్థానం
- ప్రజా కళా ఉద్యమానికి ఘన సత్కారం
- సెప్టెంబర్ 26, 27, 28న హైదరాబాద్‌లో ప్రజా కళా జాతర



**రంగారెడ్డి జిల్లా , సెప్టెంబర్ 15 (నేటి దర్శిని):** అరుణోదయ విమలక్క 50 ఏళ్ల విప్లవ ప్రజా సాంస్కృతిక ఉద్యమ ప్రస్థానాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 26, 27, 28 తేదీల్లో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి ఆర్టీసీ కళ్యాణ మండపంలో నిర్వహించనున్న ప్రజా కళా జాతరను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ షాద్‌నగర్ అమరవీరుల స్థూపం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ ప్రజా, విప్లవ ఉద్యమాలు తమ సహజ క్రమంలో ఎంతోమంది కళాకారులను సృష్టిస్తాయని, అయితే ఒకే ఆశయానికి జీవితాంతం అంకితమై ప్రజా కళా ఉద్యమానికి సేవ చేయడం అత్యంత అరుదైన విషయమని అన్నారు. చాకలి ఐలమ్మ, గద్దర్, పండుగ సాయన్న, సర్వాయి పాపన్న, కొండా లక్ష్మణ్ బాపూజీ, ఆచార్య జయశంకర్, ఆచార్య కేశవరావు జాదవ్, కొమరం భీమ్, సమ్మక్క-సారక్క, భాగ్యరెడ్డి వర్మ, అరిగే రామస్వామి తదితర మహనీయుల పోరాట స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రజా కళా జాతర ఒక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.మానవ హక్కుల వేదిక కార్యకర్త, సమాచార హక్కు రాష్ట్ర నాయకులు కె. జంగయ్య మాట్లాడుతూ ప్రజా కళాకారులు, సాంస్కృతిక యోధులు, ఆలోచనాపరులు, యువత, పౌర సమాజ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని మూడు రోజుల ప్రజా కళా జాతరను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇది వ్యక్తి పూజ కోసం నిర్వహించే కార్యక్రమం కాదని, ప్రజల కోసం, ప్రజా ఉద్యమాల కోసం, ప్రజా కళా-సాంస్కృతిక విలువల కోసం జీవితాన్ని అంకితం చేసిన కళాకారిణి, ఉద్యమానికి ఇచ్చే గౌరవమని తెలిపారు.షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన హక్కుల సంఘాల కార్యకర్తలు, ఆర్టీఐ కార్యకర్తలు, యువజనులు, వీధి వ్యాపారుల సంఘం ప్రతినిధులు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటామని తెలిపారు. స్థానిక జానపద కళారూపాలు, ప్రజా గేయాలు, సామాజిక యోధుల జీవిత గాథలను ప్రజా కళా జాతర వేదికపై ప్రదర్శించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే, ఫాతిమా షేక్, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి సామాజిక విప్లవకారుల స్ఫూర్తితో పాటు ప్రజా ఉద్యమాల్లో భాగమైన సామాజిక యోధుల పోరాటాలను కళా రూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని వక్తలు అన్నారు. కుల, మత భేదాలకు అతీతంగా ప్రజలను చైతన్యపరిచే ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతిని నిర్మించడంలో కళాకారుల పాత్ర కీలకమని తెలిపారు.

మరుగున పడుతున్న జానపద కళారూపాలకు మళ్లీ జీవం పోయడం, ప్రజా కళాకారుల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, కళాకారుల సంక్షేమ నిధి కోసం ప్రజా ఉద్యమాన్ని నిర్మించడం వంటి అంశాలకు ప్రజా కళా జాతర వేదికగా నిలవాలని ఆకాంక్షించారు.ప్రజా కళా జాతర మనందరి జాతర అని, ఇది కేవలం ఒక వ్యక్తిని స్మరించుకునే కార్యక్రమం కాదని, ప్రజా కళకు గౌరవం ఇచ్చే వేదికగా, ప్రజా సంస్కృతిని కాపాడే ఉద్యమంగా, కళాకారుల హక్కుల కోసం గొంతెత్తే సందర్భంగా, సామాజిక చైతన్యం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేసే సాంస్కృతిక పండుగగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

షాద్‌నగర్ ప్రాంత ప్రజలు, కళాకారులు, యువత, మేధావులు, పౌర సమాజ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని సెప్టెంబర్ 26, 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే ప్రజా కళా జాతరను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు కూలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, లంబాడ హక్కుల పోరాట సమితి నాయకుడు పాండు నాయక్, ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక నాయకుడు గిరి, మానవ హక్కుల వేదిక మరియు సమాచార హక్కు రాష్ట్ర నాయకులు కె. జంగయ్య, రహమద్దీన్, న్యాయవాది బసవరాజు, ఎం.డి. గౌస్, ఫారూఖ్, రవికుమార్, జ్యోతి, శీను నాయక్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# చింతపల్లి ప్రాజెక్టు వద్దే వద్దు !

- రైతుల రాస్తారోకోతో దద్దరిల్లిన చింతపల్లి
- మూడు గ్రామాల రైతుల ముక్తకంఠం.. ప్రాజెక్టు రద్దు చేయాలని డిమాండ్







**చింతపల్లి, సెప్టెంబర్ 15 (నేటి దర్శిని ):** డిండి ప్రాజెక్టులో భాగంగా చేపడుతున్న చింతపల్లి నీటిపారుదల ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చింతపల్లి, మల్లారెడ్డిపల్లి, నసర్లపల్లి గ్రామాల రైతులు మంగళవారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ప్రాజెక్టు నిర్మాణంతో తమ విలువైన సాగుభూములను కోల్పోయి భవిష్యత్తులో జీవనోపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేస్తూ చింతపల్లి మండల కేంద్రంలో రాస్తారోకో, ధర్నా, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు."మాకు ప్రాజెక్టు అవసరం లేదు.. మా భూములు మాకు కావాలి" అంటూ రైతులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇరిగేషన్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, చింతపల్లి చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనకు అన్ని పార్టీల నాయకులు మద్దతు తెలిపారు.ఎకరాకు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి ప్రాజెక్టు కోసం భూములు సేకరిస్తే ప్రస్తుత మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకుని ఎకరాకు కనీసం రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. పంటలు, చెట్లు, బోర్లు, బావులు, వ్యవసాయ పరికరాలకు ప్రత్యేక పరిహారం అందించాలని కోరారు.భూమికి బదులు ఉద్యోగం.. ఇల్లు కూడా నిర్మించాలి భూములు కోల్పోయే ప్రతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం లేదా శాశ్వత ఉపాధి కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు. నిర్వాసిత కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు ప్రభుత్వమే పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు.

రోడ్లు, తాగునీరు, విద్యుత్, మురుగునీటి పారుదల వంటి మౌలిక సదుపాయాలతో పునరావాస కాలనీ ఏర్పాటు చేయాలని, చిన్న, సన్నకారు రైతులకు ప్రత్యేక జీవనోపాధి ప్యాకేజీ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

పరిహారం చెల్లించిన తర్వాతే భూముల స్వాధీనం

రైతులకు పూర్తి పరిహారం చెల్లించిన తర్వాతే భూముల స్వాధీనం ప్రక్రియ చేపట్టాలని వారు స్పష్టం చేశారు. భూముల విలువ నిర్ణయించేటప్పుడు ప్రస్తుత మార్కెట్ ధరతో పాటు భవిష్యత్‌లో కోల్పోయే వ్యవసాయ ఆదాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

"రైతుల త్యాగాలతోనే ప్రాజెక్టులు నిర్మితమవుతున్నాయి. అభివృద్ధి పేరుతో రైతుల భూములు, ఇళ్లు కోల్పోయే పరిస్థితి రాకూడదు. భూమి తీసుకుంటే పరిహారంతో పాటు ఇల్లు, ఉద్యోగం, జీవనోపాధికి భరోసా కల్పించాలి" అని రైతులు పేర్కొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం.. స్పందించకపోతే ముట్టడి రాస్తారోకో అనంతరం రైతులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహసీల్దార్‌కు అందజేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై వెంటనే స్పందించాలని కోరారు.

ప్రభుత్వం స్పందించకపోతే ఆర్డీవో కార్యాలయం, నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం, ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని రైతులు హెచ్చరించారు.

# శేరిగూడ పీహెచ్‌సీలో వైద్య సేవలపై డీఎంహెచ్‌ఓ తనిఖీ

- 100 శాతం టీకాలు, సురక్షిత ప్రసవాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన






**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 15 (నేటి దర్శిని):** శేరిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) మంగళవారం సందర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని ఓపీ సేవలు, గర్భిణులకు అందుతున్న వైద్య సేవలు, టీకాల కార్యక్రమం, కుటుంబ నియంత్రణ సేవలు, ఎన్‌సీడీ రిజిస్టర్లు, మందుల నిల్వలు, పరిశుభ్రత, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి, స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో డీఎంహెచ్‌ఓ సమావేశమై సిబ్బంది హాజరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణ, వైద్య సేవలు అందిస్తున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా 100 శాతం టీకాల కార్యక్రమం పూర్తి చేయడంతో పాటు గర్భిణులకు సకాలంలో వైద్య సేవలు అందించి సురక్షిత ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా చూడాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా గణపతి పూజలు

- వినాయకుని ఆశీస్సులతో జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా





**మిడ్జిల్ , సెప్టెంబర్ 15 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో ):** మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ప్రతిష్ఠించిన శ్రీ గణపతి విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.వినాయక చవితి వేడుకలను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ప్రజలు అధికారులకు సహకరించి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయిశివాని, క్లాస్--4 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నరేందర్, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈతరం యువసేన ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం

- గట్టు ఇప్పలపల్లిలో భక్తులకు అన్నప్రసాద వితరణ






**తలకొండపల్లి, సెప్టెంబర్ 15 ( నేటి దర్శిని):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామంలోని గాంధీనగర్ కాలనీలో ఈతరం యువసేన అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకులు ఏ. నరేందర్, జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.సేవా భావంతో ప్రతి ఏటా ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, భక్తులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17 ముమ్మాటికీ తెలంగాణ విమోచన దినోత్సవమే

- చరిత్రను వక్రీకరించి జాతీయవాదుల త్యాగాలను మరుగునపెట్టే కుట్రలను బీజేపీ సహించదు:
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు




**ఉమ్మడి వరంగల్, సెప్టెంబర్15(నేటి దర్శని బ్యూరో):** సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో ఒక మరుపురాని, మరుగునపరచలేని చారిత్రక ఘట్టమని, ఆ రోజు నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లోకి వచ్చిన చారిత్రక సందర్భాన్ని తెలంగాణ విమోచన దినోత్సవం గా గౌరవించడం ప్రతి తెలంగాణ బిడ్డ బాధ్యతని జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అన్నారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు సూచనలతో జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అధ్యక్షతన వరంగల్ చౌరస్తా కె. కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావుపాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ విమోచన ఉద్యమం, తెలంగాణ ఎం సాయుధ పోరాటం రెండూ ఒకటే కావని, వాటి లక్ష్యాలు, రాజకీయ నేపథ్యం, కాలపరిమితి, అంతిమ లక్ష్యాలు వేర్వేరని స్పష్టంచేశారు.హైదరాబాద్ నిజాం నిరంకుశ పాలన నుంచి భారతదేశంలో విలీనం కావాలనే జాతీయవాదుల ఆకాంక్షతో సాగిన విమోచన ఉద్యమాన్ని, ఆ తరువాత కూడా కొనసాగిన కమ్యూనిస్టుల సాయుధ పోరాటంతో పూర్తిగా కలిపేయడం అంటే చరిత్రను కలగాపులగం చేయడమే కాకుండా, నిజాం వ్యతిరేకంగా భారత జాతీయ భావజాలంతో పోరాడిన జాతీయవాదులు, స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరులను అవమానించడమే అని వారు మండిపడ్డారు.1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లోకి వచ్చిందన్నారు. తెలంగాణ ప్రభుత్వ అధికారిక చరిత్ర కూడా సెప్టెంబర్ 17, 1948న హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనం అయినట్లు నమోదు చేసిందన్నారు.సెప్టెంబర్ 17ను 'విలీన దినం ప్రజా పాలన దినం అంటూ పేర్లు మార్చడం ద్వారా చరిత్రలోని అసలు భావాన్ని పలుచన చేయలేరన్నారు. పేరు మార్చినంత మాత్రాన చరిత్ర మారదని,తెలంగాణ ప్రజల రక్తంతో రాసిన చరిత్రను ఏ రాజకీయ పార్టీకి నచ్చినట్లు మార్చే హక్కు లేదు" అని వారు అన్నారు.ఓటు బ్యాంకు కోసం చరిత్రను వక్రీకరించడం మానుకోవాలన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం నాటి జాతీయవాదుల త్యాగాలను పక్కన పెట్టి సెప్టెంబర్ 17 చారిత్రక ప్రాధాన్యతను నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని వారు ఆరోపించారు.ప్రజా పాలన పేరుతో చారిత్రక దినోత్సవాన్ని మరుగునపరచే ప్రయత్నం , తెలంగాణ విమోచన చరిత్రను ప్రజల నుంచి దాచే ప్రయత్నాలు ఎంత చేసినా అవి సఫలం కావని వారు అన్నారు.తెలంగాణ ప్రభుత్వం 2024 నుంచి సెప్టెంబర్ 17ను ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించిందన్నారు.సాయుధ పోరాటాన్ని విమోచన ఉద్యమానికి ప్రత్యామ్నాయంగా చూపడం సరికాదన్నారు.తెలంగాణ సాయుధ పోరాటంలో రైతులు, పేదలు, సామాన్య ప్రజలు చేసిన త్యాగాలను బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ తక్కువ చేయదని, అయితే ఆ చరిత్రను ఆధారంగా చేసుకుని సెప్టెంబర్ 17 విమోచన ఘట్టానికి మొత్తం కీర్తిని ఒకే రాజకీయ సిద్ధాంతానికి కట్టబెట్టడం చారిత్రక వాస్తవాలను వక్రీకరించడమే అని వారు అన్నారు.తెలంగాణ సాయుధ పోరాటం 1946 నుంచి 1951 వరకు సాగిన ప్రత్యేక రాజకీయ-సామాజిక ఉద్యమం, తెలంగాణ ప్రభుత్వ విద్యా పాఠ్యాంశాల్లో కూడా 1946--51 తెలంగాణ సాయుధ పోరాటాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. అదే సమయంలో 1946లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ హైదరాబాద్ రాష్ట్రాన్ని భారత గణతంత్రంలో విలీనం చేయాలని ఉద్యమించినట్లు పాఠ్యాంశాలు పేర్కొంటున్నాయి.

సెప్టెంబర్ 17 తరువాత కూడా కమ్యూనిస్టు సాయుధ పోరాటం కొనసాగిన విషయాన్ని దాచిపెట్టి, తెలంగాణ విమోచనకు తమ పోరాటమే ఏకైక కారణమని చెప్పడం చరిత్రను తమ రాజకీయ సిద్ధాంతానికి అనుగుణంగా మలచడమేనని వారు విమర్శించారు.కమ్యూనిస్టు పార్టీ అంతర్గత పత్రాలు, చారిత్రక రచనల ప్రకారం 1950--51లో సిపిఐ ప్రతినిధులు సోవియట్ నాయకత్వంతో, స్టాలిన్‌తో చర్చలు జరిపారు. అనంతరం 1951 అక్టోబర్‌లో తెలంగాణ సాయుధ పోరాటాన్ని అధికారికంగా విరమించారు. ఈ పరిణామాలపై కమ్యూనిస్టు వర్గాల్లోనే భిన్నమైన చారిత్రక వివరణలు ఉన్నాయని వారు గుర్తుచేశారు.తమకు అనుకూలమైన చరిత్రను మాత్రమే చెప్పి, మిగిలిన చరిత్రను పాతిపెట్టే రోజులు పోయాయని, తెలంగాణ ప్రజలు మొత్తం చరిత్రను తెలుసుకోవాలనీ, నిజాన్ని చెప్పడానికి ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని వారు అన్నారు.

పరకాల, భైరాన్‌పల్లి వంటి వీరగాథలు పాఠ్యాంశాల్లో ఉండాలన్నారు.

తెలంగాణ విముక్తి కోసం ప్రాణత్యాగాలు చేసిన జాతీయవాదులు, స్వాతంత్ర్య సమరయోధులు, సామాన్య ప్రజల వీరగాథలను పాఠ్యపుస్తకాలలో సమగ్రంగా చేర్చాలని బీజేపీ డిమాండ్ చేస్తోందన్నారు.

పరకాల, భైరాన్‌పల్లి వంటి ఘటనలు కేవలం గత చరిత్ర కాదని,తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకలని, నేటి యువతకు నిజాం నిరంకుశత్వం, రజాకార్ల దమనకాండ, జాతీయవాదుల ప్రతిఘటన, భారత సైన్యం నిర్వహించిన చర్య, హైదరాబాద్ భారత యూనియన్‌లో చేరిన పరిణామాలను వాస్తవ ఆధారాలతో బోధించాల్సిన అవసరం ఉందన్నారు.

నిజాం పాలనకు వ్యతిరేకంగా తెలంగాణలో పత్రికా రచయితలు, సామాజిక కార్యకర్తలు, జాతీయవాదులు, రైతులు, సాధారణ ప్రజలు వివిధ రూపాల్లో పోరాడారని చరిత్రను సమగ్రంగా అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. హైదరాబాద్ రాష్ట్రంలో నిజాం పాలన 1948 సెప్టెంబర్ 17 వరకు కొనసాగి, ఆ తరువాత భారత యూనియన్‌లో భాగమైనట్లు అధికారిక జిల్లా చరిత్ర కూడా నమోదు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో. బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి పొన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, జలగం రంజిత్ రావ్, కుసుమ సతీష్, సిద్దం నరేష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, కందిమల్ల మహేష్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాబేటి వెంకట్ గౌడ్, జిల్లా కార్యదర్శి పొనుగోటి వెంకట్ రావు, ఐ.టి ఇంచార్జ్ ఆడెపు వెంకటేష్, మీడియా కన్వీనర్ అంకాల జనార్ధన్, బిజెపి నాయకులు బైరి మురళీకృష్ణ, కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకల రఘునారెడ్డి, బైరి శ్యాంసుందర్, బండి సాంబయ్య యాదవ్, సంగని జగదీశ్వర్, అంబాల రాంగోపాల్, గోగీకర్ అనిల్, జిల్లా మోర్చా అధ్యక్షులు టెకుమట్ల రేణుక, మదాసు రాజు, కూచన క్రాంతి కుమార్, విట్టల్ దాసు బోరహ, మహమ్మద్ రఫీ, రేపల్లె స్వర్ణజ, కొమకుల నాగరాజు, సుంకరి రాజు పాల్గొన్నారు.

## శంకుస్థాపనలకే పరిమితమైన సీసీ రోడ్ల పనులు!

- శిలాఫలకం ఆవిష్కరణతోనే సరిపెట్టారా..?
- ఏళ్లు గడుస్తున్నా ముందుకు కదలని నిర్మాణ పనులు
- ప్రశాంతపురి తండా--2 ప్రజల ఆగ్రహం.. వెంటనే పనులు చేపట్టాలని డిమాండ్




**చింతపల్లి , సెప్టెంబర్ 15 (నేటి దర్శిని ) :** చింతపల్లి మండలం ప్రశాంతపురి తండా గ్రామపంచాయతీ పరిధిలోని తండా--2లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు శంకుస్థాపనకే పరిమితమయ్యాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులకు శంకుస్థాపన చేసి నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు నిర్మాణం ప్రారంభం కాకపోవడంతో తండావాసుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

రూ.5 లక్షల పనికి రెండేళ్లుగా ఎదురుచూపులు..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.5 లక్షల అంచనా వ్యయంతో చేపట్టాల్సిన సీసీ రోడ్డు నిర్మాణానికి 2024 ఫిబ్రవరి 19న అప్పటి దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్, ఇతర ప్రజాప్రతినిధులు కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించినప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదని గ్రామస్థులు వాపోతున్నారు.

శిలాఫలకం ఉంది.. రోడ్డు మాత్రం లేదు!

శంకుస్థాపన సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని చెప్పడంతో తండావాసులు ఆశగా ఎదురుచూశారు. కానీ ఇప్పటివరకు రోడ్డు నిర్మాణ పనుల్లో ఎలాంటి పురోగతి కనిపించకపోవడంతో "శంకుస్థాపనలకే పరిమితమా?" అంటూ ప్రశ్నిస్తున్నారు.

అధికారులు స్పందించాలి

తండా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సంబంధిత పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. మంజూరైన సీసీ రోడ్డు పనులను ఆలస్యం చేయకుండా తక్షణమే ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

"శంకుస్థాపన చేసి వదిలేయకుండా.. పనులు పూర్తి చేసి ప్రజలకు రహదారి సౌకర్యం కల్పించాలి" అని ప్రశాంతపురి తండా--2 ప్రజలు కోరుతున్నారు.

# చింతపల్లి మండల స్థాయి క్రీడోత్సవాలకు శ్రీకారం

- గడియ గౌరారంలో 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు ప్రారంభం








**చింతపల్లి, సెప్టెంబర్ 15 (నేటి దర్శిని):** చింతపల్లి మండలంలోని గడియ గౌరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండల స్థాయి క్రీడోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల విద్యాశాఖ అధికారి నీరుడు అంజయ్య అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు ఉజ్జిని యాదగిరిరావు, గడియ గౌరారం సర్పంచ్ ఉజ్జిని హేమలత నరేందర్‌రావు, ఉప సర్పంచ్ ఆదిరాల కృష్ణయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

జ్యోతి ప్రజ్వలనతో క్రీడోత్సవాలకు శ్రీకారం

ముఖ్య అతిథులతో కలిసి మండల విద్యాశాఖ అధికారి నీరుడు అంజయ్య విద్యా దేవత సరస్వతీ మాతకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను అధికారికంగా ప్రారంభించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

కబడ్డీ.. కోకో.. వాలీబాల్‌లో హోరాహోరీ

మండలంలోని వివిధ పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు క్రీడోత్సవాలకు తరలివచ్చారు. కబడ్డీ, కోకో, వాలీబాల్ తదితర క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మైదానంలో విద్యార్థుల క్రీడా ప్రతిభ, పోటీతత్వం, ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

చదువుతో పాటు క్రీడలూ అవసరమే

ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు విద్యార్థుల మానసిక, శారీరక దృఢత్వానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల క్రీడా వికాసానికి సహకరిస్తున్న దాతలను, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థుల ప్రతిభకు వేదిక

మండల స్థాయి క్రీడోత్సవాలు గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు మంచి వేదికగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు తదుపరి స్థాయి పోటీల్లో రాణించేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

పాల్గొన్న వారు

ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పద్మాచారి, కృష్ణమ్మ, క్రీడల నిర్వహణలో కీలక పాత్ర పోషించిన శారీరక విద్యా ఉపాధ్యాయులు సౌజన్య, చంద్రయ్య, పద్మ, తస్లీమ్, రవి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి, సెప్టెంబర్ 15 (నేటి దర్శిని) : చింతపల్లి మండలంలోని గడియ గౌరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండల స్థాయి క్రీడోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల విద్యాశాఖ అధికారి నీరుడు అంజయ్య అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు ఉజ్జిని యాదగిరిరావు, గడియ గౌరారం సర్పంచ్ ఉజ్జిని హేమలత నరేందర్‌రావు, ఉప సర్పంచ్ ఆదిరాల కృష్ణయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

జ్యోతి ప్రజ్వలనతో క్రీడోత్సవాలకు శ్రీకారం

ముఖ్య అతిథులతో కలిసి మండల విద్యాశాఖ అధికారి నీరుడు అంజయ్య విద్యా దేవత సరస్వతీ మాతకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను అధికారికంగా ప్రారంభించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

కబడ్డీ.. కోకో.. వాలీబాల్‌లో హోరాహోరీ

మండలంలోని వివిధ పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు క్రీడోత్సవాలకు తరలివచ్చారు. కబడ్డీ, కోకో, వాలీబాల్ తదితర క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మైదానంలో విద్యార్థుల క్రీడా ప్రతిభ, పోటీతత్వం, ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

చదువుతో పాటు క్రీడలూ అవసరమే

ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు విద్యార్థుల మానసిక, శారీరక దృఢత్వానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల క్రీడా వికాసానికి సహకరిస్తున్న దాతలను, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థుల ప్రతిభకు వేదిక

మండల స్థాయి క్రీడోత్సవాలు గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు మంచి వేదికగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు తదుపరి స్థాయి పోటీల్లో రాణించేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

పాల్గొన్న వారు

ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పద్మాచారి, కృష్ణమ్మ, క్రీడల నిర్వహణలో కీలక పాత్ర పోషించిన శారీరక విద్యా ఉపాధ్యాయులు సౌజన్య, చంద్రయ్య, పద్మ, తస్లీమ్, రవి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



హాట్ లుక్స్ తో పిచ్చెక్కిస్తున్న ప్రణీత సుభాష్!

# బాక్సాఫీస్ వద్ద 'మండాడి' మేనియా..

- 5 రోజుల్లో రూ.65 కోట్లు..
- ఓటీటీ డీల్‌తో నిర్మాతకు జాక్‌పాట్!




తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదలైన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'మండాడి' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. సుహాస్, సూరి ప్రధాన పాత్రల్లో టాలెంటెడ్ డైరెక్టర్ మతిమారన్ పుగళేంది తెరకెక్కించిన ఈ చిత్రం, విడుదలై కేవలం ఐదు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.65 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించి ట్రేడ్ వర్గాలను విస్మయానికి గురిచేసింది. బోట్ రేసింగ్ నేపథ్యంతో సాగే వినూత్న కథాంశం, అద్భుతమైన యాక్షన్ ఘట్టాలు ప్రేక్షకులను థియేటర్లకు క్యూ కట్టేలా చేస్తున్నాయి.అయితే ఈ సినిమా కమర్షియల్ విజయంతో పాటు, దీని డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్‌కు సంబంధించిన న్యూస్ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. రూ.45 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ డిజిటల్ హక్కులను సొంతం చేసుకుంది. అయితే, ఈ డీల్ వెనుక ఒక ఆసక్తికరమైన బాక్సాఫీస్ లింక్ ఒప్పందం ఉన్నట్లు తెలుస్తోంది. మొదట నిర్మాత ఎల్రెడ్ కుమార్ రూ.25 కోట్లు డిమాండ్ చేయగా, నెట్‌ఫ్లిక్స్ రూ.15 కోట్లు మాత్రమే ఇవ్వడానికి ముందుకొచ్చింది. దీంతో ఇరువర్గాల మధ్య ఒక వినూత్న షరతుతో కూడిన ఒప్పందం కుదిరింది. సినిమా వసూళ్ల ఆధారంగా పారితోషికం పెరిగేలా ప్లాన్ చేశారు. బాక్సాఫీస్ వద్ద సినిమా రూ.50 కోట్లు దాటితే రూ.30 కోట్లు, అలాగే రూ.60 కోట్ల నుంచి రూ.80 కోట్ల మధ్య వసూలు చేస్తే ఏకంగా రూ.40 కోట్లు చెల్లించేలా ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం ఈ చిత్రం ఐదు రోజుల్లోనే రూ.65 కోట్ల మార్క్‌ను అందుకోవడంతో, నెట్‌ఫ్లిక్స్ రూ.40 కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెట్టిన బడ్జెట్‌లో సగానికి పైగా కేవలం ఓటీటీ హక్కుల ద్వారానే వెనక్కి వస్తుండటంతో నిర్మాతకు ఇది అసలు సిసలు జాక్‌పాట్ అని చెప్పవచ్చు. ఇదే జోరు కొనసాగితే 'మండాడి' త్వరలోనే వంద కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఆసక్తికరంగా జి.వి. ప్రకాష్ కుమార్ ఇమ్మోర్టెల్' తెలుగు ట్రైలర్

సంగీత దర్శకుడిగా, నటుడిగా టాలీవుడ్ మరియు కోలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జి.వి. ప్రకాష్ కుమార్ నటిస్తున్న తాజా చిత్రం 'ఇమ్మోర్టెల్' . తాజాగా ఈ సినిమాకు సంబంధించిన తెలుగు ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. మారీయప్పన్ చిన్న దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటికే తమిళంలో విడుదలై ఘనవిజయం సాధించగా తాజాగా తెలుగులో సెప్టెంబర్ 19న విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రంలో కాయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాకు సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తున్నారు.ఇక ఈ ట్రైలర్ చూస్తే.. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. ప్రారంభంలో జి.వి. ప్రకాష్ కుమార్ మరియు కాయదు లోహర్ మధ్య లవ్ స్టోరీగా అనిపించినా, ఆ తర్వాత కథ పూర్తిగా ఒక రహస్యమైన మలుపు తిరుగుతుంది. ఈ చిత్రంలో కథాంశం మరణం లేని ఒక రహస్య వ్యక్తి చుట్టూ తిరుగుతున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. సామ్ సి.ఎస్ అందించిన నేపథ్య సంగీతం మరియు విజువల్స్ ప్రేక్షకులను భయపెడుతూనే, సినిమాపై భారీ అంచనాలను పెంచుతున్నాయి.







# నిజమే అనుకుని ఏడ్చేదాన్ని..

ప్రస్తుతం బాలీవుడ్‌లో ఆలియాభట్ ప్రభ ఓ స్థాయిలో వెలుగుతున్నది. ఓ వైపు స్టార్‌డమ్‌ని, మరోవైపు కుటుంబ జీవితాన్ని ఆస్వాదిస్తూ ఆనందకరమైన జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నారామె. తాజాగా ఓ ప్రైవేట్ ఈవెంట్‌లో పాల్గొన్న ఆలియా.. 'కావాలని ఇతరులకు కోపం తెప్పించడం, లేదా చిరాకు పుట్టించడం' అనే అంశంపై మాట్లాడుతూ తన చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. 'చిన్నతనంలో మా అక్క షాహీన్ నిరంతరం నన్ను కోపానికి గురిచేసేది.నాకింకా బాగా గుర్తు.. నాకు నాలుగేళ్లు ఉన్నప్పుడు 'నువ్వు అమ్మానాన్నలకు సొంత బిడ్డవు కావు. పార్లే-జి బిస్కెట్ ప్యాకెట్ కొంటే ఫ్రీగా నిన్ను ఇచ్చారు' అని చెప్పి ఏడిపించేది. ఆమె సరదాగా అంటున్న ఆ మాటలను నిజమే అనుకుని ఏడ్చేదాన్ని. ఇప్పుడు ఆ క్షణాలు గుర్తొస్తే నవ్వొస్తుంది. ఏదేమైనా ఇలాంటి చిలిపి గొడవలే అక్కాచెల్లెళ్ల బంధాలను బలోపేతం చేస్తాయని నా నమ్మకం' అని గుర్తు చేసుకున్నారు ఆలియా. ప్రస్తుతం 'డోంట్ బీ షైన్' అనే సినిమాను నిర్మిస్తున్న అలియా.. లవ్ అండ్ వార్, తుంబాడ్2 చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు


# అమెజాన్ ప్రైమ్‌లో దూసుకుపోతున్న 'హుషార్ పిట్టలు'..

- ఓటీటీలోనూ అంచనాలకు మించి రెస్పాన్స్!



సినిమా పరిశ్రమలో చిన్న చిత్రంగా విడుదలై, బాక్సాఫీస్ వద్ద భారీ ప్రభంజనం సృష్టించిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'హుషార్ పిట్టలు'. ఇప్పుడు ఈ సినిమా డిజిటల్ రంగంలోనూ అదే జోరును కొనసాగిస్తోంది. థియేటర్లలో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుని బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న ఈ చిత్రం, ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో అధికారికంగా స్ట్రీమింగ్ ప్రారంభించుకుంది. థియేటర్లలో ఈ సినిమాను చూడలేకపోయిన సినీ ప్రియులు, ప్రస్తుతం ఓటీటీలో చూసేందుకు అమితాసక్తి కనబరుస్తున్నారు.కేవలం యూత్‌ను మాత్రమే కాకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను, కుటుంబాలను ఆకట్టుకునేలా అద్భుతమైన భావోద్వేగాలు, వినోదాత్మక అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. అన్ను మరియు వాసవి గణేషన్ జంటగా నటించిన ఈ సినిమాలో ప్రతి ఒక్కరూ రిలేట్ చేసుకునేలా రియలిస్టిక్ సన్నివేశాలు ఉంటాయని చిత్ర యూనిట్ తెలిపింది. రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించగా, పద్మ అమ్మ మరియు బీవీజీ స్టూడియోస్ సహకారంతో ఇది ప్రేక్షకుల ముందుకు వచ్చింది. వినూత్న కథాకథనాలతో ఈ చిత్రానికి బిక్షు దర్శకత్వం వహించగా, సురేష్ ఏషియన్ ఫిలింస్ సంస్థ దీనిని థియేటర్లలో ఘనంగా విడుదల చేసింది. థియేటర్లలో ప్రేక్షకులే స్వయంగా ప్రచారకర్తలుగా మారి ఈ సినిమాను పెద్ద హిట్ చేశారని, ఇప్పుడు అమెజాన్ ప్రైమ్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆడియన్స్‌కు ఈ చిత్రం మరింత చేరువవుతోందని చిత్ర నిర్మాత ఆశాభావం వ్యక్తం చేశారు. వీకెండ్‌లో మంచి టైమ్ పాస్ కోసం చూస్తున్న మూవీ లవర్స్‌కు 'హుషార్ పిట్టలు' ఒక చక్కటి ఎంపిక అని చెప్పవచ్చు.

# ఆకట్టుకుంటున్న 'అనుమాన పక్షి' ట్రైలర్!




యువతను విపరీతంగా ఆకట్టుకుని బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించిన 'డీజే టిల్లు' చిత్ర దర్శకుడు విమల్ కృష్ణ ఇప్పుడు మరో డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. టాలెంటెడ్ హీరో రాగ్ మయూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'అనుమాన పక్షి' . తాజాగా విడుదలైన ఈ సినిమా ట్రైలర్ సినిమాపై అంచనాలను విపరీతంగా పెంచేసింది.ట్రైలర్‌ను గమనిస్తే.. హీరో పాత్రలోని 'అనుమానం' అనే బలహీనత చుట్టూ కథ ఎంతో ఆసక్తికరంగా, నవ్వులు తెప్పించేలా నడుస్తుందని స్పష్టమవుతోంది. ప్రతి చిన్న విషయానికి అనుమానపడే వ్యక్తిగా రాగ్ మయూర్ అద్భుతమైన హావభావాలతో కడుపుబ్బా నవ్విస్తున్నారు. కేవలం కామెడీ మాత్రమే కాకుండా ఇందులో మంచి క్రైమ్ థ్రిల్లర్ మరియు డార్క్ కామెడీ ఎలిమెంట్స్ కూడా జోడించినట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. ఈ చిత్రంలో రాగ్ మయూర్ సరసన మెరిన్ ఫిలిప్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రిన్స్ సెసిల్, బ్రహ్మాజీ, అజయ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. చిలకా ప్రొడక్షన్స్ సమర్పణలో రాజీవ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా, శ్రీచరణ్ పాకాల అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. వైవిధ్యమైన కథాకథనాలతో వస్తున్న ఈ 'అనుమాన పక్షి' సినిమా సెప్టెంబర్ 18న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. డీజే టిల్లు లాంటి మాస్ ఎంటర్‌టైనర్ తర్వాత విమల్ కృష్ణ ఈసారి ఎలాంటి వినోదాన్ని పంచబోతున్నారోనని సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365